Postal Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ···· Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 సంచిక : 331 పేజీలు 8 వెల : 5 ఆదివారం 31 మే 2026







2లో..

## మధ్యప్రదేశ్‌లో ఘోర ప్రమాదం

ట్రాక్టర్ బోల్తా పడి ఆరుగురు మృతి

మరో 40మందికి తీవ్ర గాయాలు



## గొడ్డలి పార్టీ అంశం.. సైకోలో ఫ్రస్టేషన్ పెరుగుతోంది: చంద్రబాబు

అమరావతి: గొడ్డలి పార్టీ అని ప్రజల్లోకి వెళ్లే కొద్దీ సైకోలో ఫ్రస్టేషన్ పెరుగుతోందని సీఎం చంద్రబాబు విమర్శించారు. సైకో కంటే గొడ్డలి పార్టీ అనే అంశాన్ని ప్రజలు బాగా గుర్తించారని చెప్పారు. ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. "వెలుగులోకి వస్తున్న వైఎస్ కుటుంబ అరాచకాలు నాకు కూడా తెలియవు. ప్రజాస్వామ్యానికి ఇలాంటి వాళ్లు పనికిరారు. మావోయిస్టులు తుపాకులతో రాజ్యాధికారాన్ని సాధించలేరు. వీళ్లు మాత్రం గొడ్డలితో ఎలా రాజకీయాలు చేస్తారు? వివేకా హత్య కేసులో సునీత పోరాటంలో న్యాయం ఉంది. తన తండ్రిని ఎవరు చంపారో తెలుసుకునే హక్కు ఆమెకు ఉంది. ఆమె పోరాటం వల్లే ఇప్పటికీ ఆ హత్య కేసు సజీవంగా ఉంది. నేటి తరానికి కూడా వీళ్ల హత్యా రాజకీయాలు తెలుస్తున్నాయి""నియోజకవర్గాల పునర్విభజన, మహిళా బిల్లులపై కేంద్రం పట్టుదలగా ఉంది. ఇవి దేశ రాజకీయాల్లో పెనుమార్పులు తీసుకొస్తాయి. రెండు బిల్లులను విడదీసి చూడాల్సిన అవసరం లేదు. బిల్లులను గతంలో వ్యతిరేకించిన వారి ఆలోచనలు ఇప్పుడు మారొచ్చు. తెదేపా ప్రకటించిన 33 శాతం రిజర్వేషన్లు దేశ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. మహిళలకు మొదటినుంచి మా పార్టీ అండగా ఉంది. పునర్విభజనలో 2011 జనాభా లెక్కలైనా, తాజా జనాభా లెక్కలైనా మనకు నష్టం.



సాంకేతికతో సాధ్యాసాధ్యాలను పరిశీలించండి

గోదావరి కాలుష్యాన్ని తొలగించేందుకు యత్నం

పల్నాడులో పర్యటించి జిందాల్ ప్లాంట్‌ను పరిశీలించిన పవన్

# జిందాల్ తరహాలో వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లు

పల్నాడు:జిందాల్ పరిశ్రమ తరహాలోనే గోదావరి నదీ కాలుష్యాన్ని అరికట్టేందుకు సాంకేతికతను ఎలా అనుసంధానం చేయవచ్చో పరిశీలించాలని అధికారులను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. నదీ పరీవాహక ప్రాంతాల్లో చెత్తను వేరు చేసి, దాన్ని విద్యుత్ తయారీకి ఉపయోగించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. రాష్ట్రంలో రోజూ ఉత్పత్తి అవుతున్న వ్యర్థాలను సద్వినియోగం చేసుకునేలా మరిన్ని 'వేస్ట్ టూ ఎనర్జీ' ప్లాంట్ల ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాలని సూచించారు. పల్నాడు జిల్లా కొండవీడు పరిధిలోని జిందాల్ 'వేస్ట్ టూ ఎనర్జీ' ప్లాంట్‌ను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్లాంట్‌లో చెత్తను సేకరించడం దగ్గర నుంచి బాయిలర్‌లో అది బూడిదగా మారే వరకూ.. ప్రక్రియను ఆసక్తిగా పరిశీలించారు. చెత్త నుంచి విద్యుత్ తయారీ విధానంపై ప్లాంట్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా అధికారులు, ఎ÷-లాంట్ నిర్వాహకులకు ఉప ముఖ్యమంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇందుకోసం దేశంలోనే అత్యంత స్వచ్ఛమైన నగరంగా పేరొందిన 'ఇండోర్ మోడల్' తరహాలో చెత్తను పద్ధతిగా, పారదర్శకంగా వేరు చేసేలా కొత్త మార్గదర్శకాలను రూపొందించాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మరోవైపు.. ప్లాంట్ అధికారులు ఉప ముఖ్యమంత్రికి అంతర్జాతీయ, జాతీయ స్థాయి గణాంకాలను వివరించారు. సింగపూర్‌లో మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో 2.8 శాతం కేవలం ఇలాంటి చెత్త ప్లాంట్ల నుంచే లభిస్తోందని పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పాటు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ గ్రిడ్‌తో ఈ వ్యర్థ ఆధారిత విద్యుత్ ప్లాంట్ల అనుసంధానం చాలా అద్భుతంగా ఉందని అధికారులు ప్రశంసించారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ సరఫరా వృథా శాతం అత్యంత తక్కువగా ఉండటం విశేషమని డిప్యూటీ సీఎంకు ఈ సందర్భంగా అధికారులు తెలియజేశారు.

# ఖరీఫ్‌కు 22,348 క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధం

90 శాతం రాయితీపై రైతులకు అందజేత

మంత్రి గుమ్మడి సంధ్యారాణి వెల్లడి

2లో..



# కర్నాటక సిఎల్‌పి నేతగా డికె ఏకగ్రీవ ఎన్నిక



2లో..

3న ప్రమాణ స్వీకారానికి పార్టీ నిర్ణయం

డికెను సిఎల్‌పి నేతగా ప్రతిపాదించిన సిద్ధరామయ్య

నాయకత్వ మార్పు సజావుగా జరిగిందన్న కెసి వేణుగోపాల్

# ధాన్యం కొరుగోళ్లలో కేంద్రం తీరు దుర్మార్గం



- మోటర్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో పోటీచేయను
- ఉచిత విద్యుత్ ఆపేసినా రాజకీయాల నుంచి తప్పకుంటా
- లేపకుంటే బిఆర్ఎస్ రాజకీయాల నుంచి తప్పకుంటుందా
- రైతుల ముసుగులో లబ్ధికి కెసిఆర్ రాజకీయ ఎత్తుగడలు
- కొనకపోతే బిజెపి ఎంపిల ఇళ్లముందు ధాన్యం పోస్తాం
- హరీష్ రావు భవిష్యత్తు ఆయన చేతుల్లోనే లేదు
- మహేశ్ గౌడ్‌ది నాది విన్నింగ్ కాంబినేషన్
- మీడియా చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి

వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టాలని ప్రధాని మోడీ ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఇది చెప్పకున్నా బిఆర్ఎస్ తన రాజకీయ లబ్ది కోసం పదేపదే దీనిని వాడుకుందని ఆరోపించారు. ఎపిలో కూడా జగన్ స్మార్ట్ మీటర్లు పెడతానని ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఇకపోతే మేం ఏడాదికి రూ.70 వేల కోట్లు అప్పు చేస్తే.. రూ.95 వేల కోట్ల అప్పు తీరుస్తున్నాం. మేం తీరుస్తున్న అప్పల గురించి హరీశ్‌రావు చెప్పడం లేదు. రూ.54 వేల కోట్లు అప్పులు తీసుకుంటామని ముందే చెప్పాం.

2లో..

# మోసపు హామీలతో గద్దెనెక్కి దగా



కాంగ్రెస్ పాలనలో రైతులు మోసపోయారు

బిజెపి ప్రజల్లోకి వెళితే తప్ప ప్రభుత్వం మేల్కోలేదు

కేంద్రాన్ని విమర్శించడం తప్ప చేసిందేమీ లేదు

మీడియా సమావేశంలో మండిపడ్డ కిషన్ రెడ్డి

పేదలను, రైతులను మోసం చేస్తున్నారు. అందరికీ కేంద్రాన్ని విమర్శించడం అలవాటు అయింది. ఇతర రాష్ట్రాల కన్నా ఎక్కువ ధాన్యాన్ని తెలంగాణ నుంచి కేంద్రం తీసుకుంది. ఈ ప్రభుత్వం రైతులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని అనుకుంటుంది.

**హైదరాబాద్:** మార్పు పేరుతో దొంగ మాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. తెలంగాణ రైతాంగం పట్ల నిర్లక్ష్యంగా నిస్సిగ్గుగా వ్యవహరిస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ లేని విధంగా దళారులు, ప్రభుత్వం, రైస్ మిల్లర్ల చేతిలో రైతులు విలవిల్లాడుతున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వం చేతకాని తనం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. మంత్రులు ఏసీ రూముల్లో గడిపారని.. తమ ఎంపీలు, ఎమ్మెల్యేలు రైతుల దగ్గరికి వెళ్ళే వరకు మేలుకోలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానం గతంలో ఎలా ఉండేదో ఇప్పుడు అలానే ఉందని విమర్శించారు. రైతుల దగ్గర నుంచి కేంద్రం మిగతా 2లో



2లో..

## గ్రీన్‌కార్డు దరఖాస్తు దారులకు ఊరట

నిబంధనలపై అమెరికా యూటర్న్



2లో..

## కాళేశ్వరంను పడావు పెట్టడం సరికాదు

ప్రజావసరాలు మరమ్మతులపై ఎందుకీ తాత్సారం

ప్రభుత్వ తీరుపై బండారు దత్తాత్రేయ విమర్శలు

# తెలుగు రాష్ట్రాల్లో తగ్గని ఎండల తీవ్రత

ఎల్‌నినోతో ఆలస్యం కానున్న రుతుపవనాలు



హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో ఎండలకు తోడు, వడగాలులు కూడా ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అడపాదడపా కొన్నిచోట్ల ఉరుములతో కూడిన వర్షాలు పడుతున్నా, మొత్తంగా ఎండలు మాత్రం శాంతించడం లేదు. రుతుపవనాలు కూడా ఆలస్యం అవుతున్నాయి. పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న 'సూపర్ ఎల్‌నినో' ప్రభావంతోజూన్ 1 నుంచి అక్టోబర్ వరకు నైరుతి సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదయ్యే పరిస్థితులు లేవని వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలో భిన్నవాతావరణం కొనసాగుతున్నది. తెల్లవారుజామున, రాత్రివేళలో వర్షం కురుస్తుండగా.. మిగతా సమయంలో ఎండలు దంచికొడుతున్నాయి. 17 జిల్లాల్లో 45




డిగ్రీలకుపై గా గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యాయి. మంచిర్యాల జిల్లా తాండూరులో అత్యధికంగా 46.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. పెద్దపల్లి, వరంగల్ జిల్లాల్లో 46.3 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, కుమ్రం భీం ఆసిఫాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో 46.2 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెలుగు రాష్ట్రాల్లో వర్షపాతం కొద్దిగా ఆశించినస్థాయిలో ఉన్నప్పటికీ దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఇది దేశవ్యాప్తంగా రుతుపవనాల విస్తరణపై ప్రతికూలప్రభావం చూపే అవకాశం ఉన్నట్టు వెల్లడించింది. వాతావరణంలో నెలకొన్న ఈ అనిశ్చితి దృష్ట్యా నీటిని పొదుపుగా వాడుకొంటూ, పంటల ప్రణాళికలను రూపొందించు కోవాలని వాతావరణ నిపుణులు హెచ్చరించారు. 2026 నైరుతి రుతుపవనాల కాలానికి సంబంధించిన తుది దీర్ఘకాలిక వాతావరణ అంచనాలను భారత వాతావరణ శాఖ విడుదల చేసింది.



2లో..

## పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం

సిబిఎస్ఇ మూల్యాంకనలో లోపాలు దారుణం

అసమర్థ వ్యవస్థలపై దేశాన్ని నిర్మించలేమన్న కెటిఆర్

విద్యార్థులకు అండగా పోరాడుతామని ప్రకటన

# గ్రీన్‌కార్డు దరఖాస్తు దారులకు ఊరట

నిబంధనపై అమెరికా యూటర్న్



వాషింగ్టన్:శాశ్వత నివాస హక్కు కోసం దరఖాస్తు చేసుకునే వారు తప్పనిసరిగా తమ స్వదేశాలకు తిరిగి వెళ్లాలని ఇటీవల ప్రకటించిన అమెరికా ప్రభుత్వం తాజాగా వెనక్కి తగ్గింది. ఆ నిబంధన అందరికీ వర్తించదని, దరఖాస్తును బట్టి ఇమిగ్రేషన్ అధికారులు నిర్ణయం తీసుకుంటారని అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం తాజాగా ప్రకటించింది. తాత్కాలిక వీసాలపై ఉన్నవారు గ్రీన్ కార్డ్ పొందాలంటే తమ స్వదేశంలోనే దరఖాస్తు చేసుకోవాలని గత వారం అమెరికా పౌరసత్వ, వలస సేవల సంస్థ మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ ప్రకటనతో హెచ్1బీ వీసాదారులు, విదేశీ విద్యార్థులు, తాత్కాలిక ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. దీనిపై తాజాగా డీహెచ్ఎస్ వివరణ ఇచ్చింది. ఈ నిబంధన ఎప్పట్నుంచో ఉందని, ఇమిగ్రేషన్ అధికారులకు తమ విచక్షణాధికారాన్ని గుర్తు చేయడానికే గత వారం తాము మార్గదర్శకాలు విడుదల చేశామని తెలిపింది. రఖాస్తుదారుడి పరిస్థితులు, ఆర్థిక ప్రయోజనాలు, జాతీయ ప్రయోజనాల వంటి అంశాలను పరిశీలించి అతడు అమెరికాలో ఉండాలా, స్వదేశానికి వెళ్లాలా అనే విషయంపై ఇమిగ్రేషన్ అధికారులు నిర్ణయం తీసుకుంటారని డీహెచ్ఎస్ తెలిపింది
(ఉస॥ని అజీసట ఖసనీఇ॥బబ). ప్రత్యేకించి అమెరికా ఆర్థిక వ్యవస్థకు మేలు చేసే లేదా జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన ఉద్యోగాల్లో ఉన్నవారికి మినహాయింపులు లభించే అవకాశం ఉందని యూఎస్‌సీఐఎస్ ఇప్పటికే సంకేతాలు ఇచ్చింది.


# ధాన్యం కొరుగోళ్లలో కేంద్రం తీరు దుర్మార్గం

హైదరాబాద్: తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ నిలిపివేసినా, మోటార్లకు మీటర్లు పెట్టినా తాము ఎన్నికల్లో పోటీ చేయబోమని, ఈ సవాల్‌కు బీఆర్ఎస్ సిద్ధమా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియాతో చిట్ చాట్ చేస్తూ.. రాజకీయ లబ్ధి కోసమే కేసీఆర్ రైతుల ముసుగులో లైఫ్ లైన్ కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దేశంలోనే తొలిసారిగా రైతుల కోసం ప్రత్యేకంగా 'రైతు డిస్కం' ఏర్పాటు చేశామని, దీనివల్ల ప్రభుత్వానికి తక్కువ ధరకే విద్యుత్ కొనుగోలు చేసే వెసులుబాటుతో పాటు జవాబుదారీతనం పెరుగుతుందని స్పష్టం చేశారు. భారత రాష్ట్ర సమితికి సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. మోటార్లకు మీటర్లు పెడితే, రైతులకు ఉచిత విద్యుత్ నిలిపివేస్తే.. తాము ఎన్నికల్లో పోటీ చేయబోమన్నారు. తాము ఉచిత విద్యుత్ కొనసాగిస్తే.. బీఆర్ఎస్ ఎన్నికలకు దూరంగా ఉంటుందా అని సిఎం రేవంత్ సవాల్ విసిరారు. రైతుల ముసుగులో కేసీఆర్ రాజకీయ లబ్ధికి యత్నిస్తున్నారని ఆరోపించారు. అన్నదాతలకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించేందుకే రైతు డిస్కం ఏర్పాటు చేస్తున్నాం. ఉచితంగా అందిస్తున్న విద్యుత్ వినియోగాన్ని దీనికి కనెక్ట్ చేస్తున్నాం. రైతు డిస్కంతో జవాబుదారీతనం పెరుగుతుందన్నారు. వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టాలని ప్రధాని మోడీ ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఇది చెప్పకున్నా బిఆర్ఎస్ తన రాజకీయ లబ్ధి కోసం పదేపదే దీనిని వాడుకుందని ఆరోపించారు. ఏపిలో కూడా జగన్ స్మార్ట్ మీటర్లు పెడతానని ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఇకపోతే మేం ఏడాదికి రూ.70 వేల కోట్లు అప్పు చేస్తే.. రూ.95 వేల కోట్ల అప్పు తీరుస్తున్నాం. మేం తీరుస్తున్న అప్పుల గురించి హరీశ్‌రావు చెప్పడం లేదు. రూ.54 వేల కోట్లు అప్పులు తీసుకుంటామని ముందే చెప్పాం. ఎఫ్ఆర్‌బీఎం పరిధి దాటి అప్పులు చేయడానికి అనుమతి లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి వదిలేసిందే తప్ప ఒక్క గింజ కూడా కొనడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో వరి, జొన్న, మొక్కజొన్న పంటలను తమ ప్రభుత్వమే పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తోందని, ఇప్పటివరకు 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. తడిచిన ధాన్యానికి సైతం మద్దతు ధర కల్పిస్తున్నామని, సన్న వడ్లకు బోనస్ ఇస్తామని భరోసా ఇచ్చారు. బీజేపీ నేతలు ఢిల్లీకి బస్సులు వేసుకుని వెళ్లి ధాన్యం కొనుగోలుకు ఒత్తిడి తేవలన్నారు. లేకుంటే తాము వారి ఇళ్ల ముందుకే ట్రాక్టర్లతో వడ్లు తెచ్చి పోస్తామని ఆయన హెచ్చరించారు. అంతర్రాష్ట్ర జల వివాదాలపై ప్రధాని మోదీ మాటలు చెబుతున్నా, తుమ్మిడిహట్టి కోసం మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆక్షేపించారు. కేంద్రంలోని భాజపా సర్కారు వడ్లు సరిగ్గా కొనుగోలు చేయడం లేదు. రాష్ట్రంలో 32 శాతం ధాన్యం మాత్రమే కొంటోంది. ధ్యాన్యం కొనకపోతే భాజపా నేతల ఇళ్ల ముందు ధాన్యం పోస్తాం. అంతర్రాష్ట్ర జలవివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలని ప్రధాని మోదీ చెబుతున్నారు. ప్రాణహిత ప్రాజెక్టుపై మహారాష్ట్ర సీఎంతో చర్చలకు ప్రయత్నిస్తున్నాం. ఆయన ఎందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు. హరీష్ రావు ఇదులకుంట చెరువు అక్రమాలపై ఎందుకు మాట్లాడటం లేదని



ప్రశ్నించారు. ఎన్టీఆర్ విగ్రహం చుట్టూ ప్రాంతీయ, కుల వివాదాలు చేయడం బుద్ధిలేనితనమని, తన దృష్టి అంతా అభివృద్ధి పైనే ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్ మీద ఒట్టేసి.. బీఆర్ఎస్‌లోనే ఉంటానని హరీశ్‌రావు చెప్పాలన్నారు. గతంలోనూ హరీశ్‌రావు.. వైఎస్సార్ దగ్గరికి వెళ్లారు. ఆయన ఎవరెవరితో మాట్లాడుతున్నారో నాకు తెలుసు.. కానీ చెప్పను. ఇటీవల పార్టీ మీటింగ్ వదిలేసి ఆయన దిల్లీకి ఎందుకు వెళ్లారు? భాజపా, బీఆర్ఎస్‌లు కలిసి పోటీ చేస్తాయనడంలో అనుమానమే లేదు. సీబీఎస్ఈలో జవాబపత్రాలు తారుమారు చేసిన గ్లోబరీనా.. కేటీఆర్ బినామీ సంస్థ. గ్లోబరీనా సంస్థ కేటీఆర్ బినామీదేనని ఆరోపించిన సీఎం అదే ఇప్పుడు పేరు మార్చుకుందన్నారు. 2034 వరకు రాష్ట్ర రాజకీయాల్లోనే ఉంటాను. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, నాది విజయవంతమైన కాంబినేషన్. మేం అన్ని ఎన్నికలు గెలిచాం. భవిష్యత్తులోనూ విజయం సాధిస్తాం. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆయనకు మంచి పదవి రావొచ్చు. జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇప్పుడే తొందర లేదు. ఎన్టీఆర్‌ను కులం, ప్రాంతంతో పోల్చడం బుద్ధిలేనితనం. పొట్టి శ్రీరాములు వర్సిటీకి సురవరం పేరు పెట్టిందే నేను. వివాదాలు, సెంటిమెంట్‌తో రాజకీయాలు చేయాలని అనుకోవడం లేదని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు.

## కాళేశ్వరంను పడావు పెట్టడం సరికాదు



పెద్దపల్లి: లక్ష కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుతం రైతులకు, ప్రజలకు పనికి రాకుండా పోయిందని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ విమర్శించారు. ప్రాజెక్టుకు అవసరమైన మరమ్మతులు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి కనిపించడం లేదని ఆరోపించారు. బండారు దత్తాత్రేయ గోదావరిఖనిలో పర్యటించి కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. మేడిగడ్డ బ్యారేజ్‌పై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఇప్పటికే స్పష్టమైన నివేదిక ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని రైతులు సాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దత్తాత్రేయ తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మూడు ప్రధాన బ్యారేజీల్లో ప్రస్తుతం నీరు లేకపోవడం ఆందోళనకర విషయమ న్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి, రైతులకు సాగునీరు అందించే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు అవసరమైన సాగునీటిని అందించడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత అని బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు.

## మోసపు హామీలతో గద్దెనెక్కి దగా




నేరుగా కొనదు.. మీ దద్దమ్మ తనం కేంద్రం మీద మోపుతున్నారని మండిపడ్డారు. దొడ్డు బియ్యం పండించే రైతుల పరిస్థితి ఏందని ప్రశ్నించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రైతులతో ఆడుకుంటున్నాయని.. ఈ ప్రభుత్వానికి కాంట్రాక్టులు, కమీషన్లు, భూ దందాల మీద ఉన్న దృష్టి రైతుల మీద లేదని విమర్శించారు. ఆ మంత్రి ఎంత ఈ మంత్రి ఎంత కమీషన్ తీసుకున్నారు.. నేనెంత తీసుకోవాలని చర్చిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. దేశ వ్యాప్తంగా విపరీతంగా ధాన్యం ఉత్పత్తి జరిగిందని.. ఎక్కడ గోదాంలు ఖాళీగా లేవని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. 'విదేశాలకు సప్లై చేయాలి అంటే ఫెస్టిసైడ్ వాడ కూడదు. క్షేత్ర స్థాయిలో ఆర్గానిక్ ఫార్మింగ్‌పై అవగాహన కల్పిస్తుందా? రైతుల ఉసురు తీసుకుంటుంది ఈ ప్రభుత్వం. ఆంధ్రప్రదేశ్‌లో ఈ సమస్య ఎందుకు లేదు. 6 నెలల ముందు గన్ని బస్తాలు తెచ్చుకుంటే ఏమయ్యింది. ఇక్కడ పండే సన్న బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు సప్లై చేస్తున్నారు. ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. తక్కువ ధరకు ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చి ఇక్కడ నాశి రకం సన్న బియ్యాన్ని పేద ప్రజలకి అందిస్తున్నారు. పేదలను, రైతులను మోసం చేస్తున్నారు. అందరికీ కేంద్రాన్ని విమర్శించడం అలవాటు అయింది. ఇతర రాష్ట్రాల కన్నా ఎక్కువ ధాన్యాన్ని తెలంగాణ నుంచి కేంద్రం తీసుకుంది. ఈ ప్రభుత్వం రైతులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని అనుకుంటుంది. ఆర్గానిక్ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని ప్రధాని పదేపదే చెపుతున్నారు.

## బంగారానికి తగ్గుతున్న డిమాండ్

### మరోమారు స్వల్పంగా తగ్గిన ధరలు

ముంబయి: దేశంలో బంగారానికి డిమాండ్ భారీగా పడిపోయింది. పసిడి విక్రయాలు 70 శాతం తగ్గిపోయాయి. ఈ నేపథ్యంలో ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. శుక్రవారం హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం 1,57,640 రూపాయల వద్ద ట్రేడ్ అయింది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం 1,44,500 రూపాయల వద్ద ట్రేడ్ అయింది. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం 1,18,230 రూపాయల వద్ద ట్రేడ్ అయింది. శనివారం బంగారం ధరలు భారీగా తగ్గాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై రూ. 600.. 22 క్యారెట్ల బంగారంపై రూ. 550 .. 18 క్యారెట్ల బంగారంపై రూ. 450 తగ్గింది. గుడ్‌రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం ఉదయం 11 గంటల సమయంలో హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం 1,57,040 రూపాయల వద్ద.. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం 1,43,950 రూపాయల వద్ద.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం 1,17,780 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది.

# పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం



హైదరాబాద్: దేశంలో నీట్ పరీక్షల అక్రమాలపై రేగిన వివాదం ఇంకా చల్లబడకముందే, భారతీయ విద్యా వ్యవస్థ ప్రతిష్టను మరింత మసకబారుస్తూ సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాల వివాదం తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. ఇటీవలే విడుదలైన సీబీఎస్ఈ ఫలితాలలో డిజిటల్ మూల్యాంకనం లోపాల కారణంగా తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ మార్కుల తారుమారు వ్యవహారం దేశవ్యాప్తంగా దాదాపు 18.5 లక్షల మంది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనలో ముంచెత్తింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. న్యాయం కోసం ఉధృతంగా పోరాడుతున్న విద్యార్థులకు తన పూర్తి మద్దతును ప్రకటిస్తూ.. దేశ భవిష్యత్తును ఇలాంటి కుళ్ళిన, అసమర్థ వ్యవస్థల మీద ఎంతమాత్రం నిర్మించలేమని హెచ్చరించారు. ఈ మొత్తం వ్యవహారంలో గతంలో తెలంగాణను కుదిపేసిన ఒక చేదు జ్ఞాపకం మళ్లీ తెరపైకి వచ్చిందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. 2019లో తెలంగాణలో ఇంటర్మీడియట్ ఫలితాలను అస్తవ్యస్తం చేసి, పలువురు విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమైన 'గ్లోబరేనా' సంస్థే ఇప్పుడు కేవలం తన పేరును మార్చుకుని, సీబీఎస్ఈ నుంచి అంతకంటే పెద్ద కాంట్రాక్ట్‌ను దక్కించుకోవడం అత్యంత దురదృష్టకరమని మండిపడ్డారు. కేంద్ర బోర్డు నిర్లక్ష్యం వల్లే ఇప్పుడు దేశవ్యాప్తంగా ఇంత పెద్ద గందరగోళం నెలకొందని విమర్శించారు.
నాడు గ్లోబరేనా వ్యవహారంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిం చిందని కేటీఆర్ గుర్తుచేశారు. లోపాలను వెలికితీసేందుకు తక్షణమే ముగ్గురు నిపుణులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశామని, ఆ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా తప్పు చేసిన సంబంధిత అధికారులను పదవుల నుంచి తక్షణమే తొలగించామని కేటీఆర్ వివరించారు. అంతేకాకుండా, బాధ్యురాలైన సదరు సంస్థపై కోర్టులో చట్టపరమైన క్రిమినల్ చర్యలు కూడా తీసుకున్నామని ప్రస్తావించారు. ఇంతటి చెడ్డ పేరు ఉన్న ఒక అసమర్థ సంస్థను సీబీఎస్ఈ బోర్డు ఎలా నమ్మిందని కేటీఆర్ ప్రశ్నించారు. కేవలం ఆ సంస్థకు లబ్ది చేకూర్చేందుకే బోర్డు తన నిబంధనలను పదే పదే మార్చిందని ఆయన ఆరోపించారు. ఒక చిన్న పేరు మార్పు పక్రియతో పాత తప్పులను దాచిపెట్టి, లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో, భవిష్యత్తుతో ఆడుకోవడం క్షమించరాని నేరమని స్పష్టం చేశారు. నిరుద్యోగం, పరీక్షల లీకేజీలు, తప్పుడు మూల్యాంకనాలతో దేశంలోని విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెట్టేస్తున్నారని, లక్షలాది మంది మానసిక క్షోభకు కారణమైన ఈ మార్కుల వివాదానికి కేంద్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి కచ్చితంగా దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు. బాధితులైన విద్యార్థులకు పూర్తి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉండి పోరాడుతుందని కేటీఆర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# జనాభా కాదు..మౌళిక వసతులు ఆలోచించండి !

దేశంలో ప్రస్తుతం ఉన్న జనాభాకే సరైన మౌళిక సదుపయాలు లేవు. విద్య,వైద్యం అందించే స్థితిలో ప్రభుత్వాలు లేవు. అలాగే నిత్యావసరాలు అందడం లేదు. ఉండడానికి ఇల్లు లేదు. దేశంలో అత్యధిక జనాభాకు కనీస గూడు కూడా కరువే. ఘనత వహించిన పాలకుల తీరు కారణంగా ప్రజలు నానా అగచాట్లు పడుతున్నా పాలకులకు పట్టింపు లేదు. ధాన్యం దిగుబడులు పెరుగుతున్నా, వాటిని సకాలంలో సేకరించే యంత్రాంగం లేదు. ఉన్న జనాభాను పనులకు ఉపయోగించుకునే తెలివి లేకుండా పోయింది. ఇదంతా కూడా కేవలం వ్యవస్థాగత లోపంతో పాటు, పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడం, పరిపాలనానుభం లేకపోవడం ప్రధాన కారణంగా చూడాలి. ఇలాంటి సమయంలో ఈ మధ్య ఎపి సిఎం చంద్రబాబు పిల్లలను కనండి.. డబ్బులు పడేస్తాను అంటూ ప్రచారంతో ఊదరగొడుతున్నారు. తను ఒక్క కొడుకునే కన్నాడు. తన కొడుకు లోకేశ్ కూడా ఒక్క పిల్లాడిని కని మిన్నకున్నారు. చంద్రబాబు పిలుపు ఇంటికి పనికిరాదా అన్నది చెప్పాలి. కనీస మౌళిక వసతులు కల్పించేందుకు చంద్రబాబు పనిచేస్తున్నారా అన్నది చెప్పాలి. ఇవేవీ కల్పించ కుండా పిల్లలను కని పడేసతే వారికి తిండి,బట్ట, చదువుసంధ్యా, వైద్యం ఎవరు అందిస్తారో చెప్పాలి. ఇందుకు గ్యారెంటీ ఇవ్వగలరా అన్నది చెప్పాలి. ఇప్పుడున్న పిల్లలకు ఈ రకమైన వసతులు కల్పించడానికి ఏం చేస్తున్నారో చంద్రబాబుతో సహా పాలకులంతా ప్రకటించాలి. దేశాన్ని అభివృద్ధి వైపు తీసుకుని వెళ్లే బదులు ఇలా తిరోగమనం వైపు తీసుకుని వెళ్లే యత్నంలో రాజకీయ కోణం తప్ప మరోటి లేదు. జనాభా నియంత్రణ లేకపోవడంతో దేశంపై ఎంతగా భారం పడుఉతందో చెప్పడం లేదు. ప్రజలు త్యాగాలు చేస్తుంటే... నాయకులు భోగాలు అనుభవిస్తున్నారు. కేవలం సీట్లు పెంచుకోవడం అన్న ధ్యాస తప్ప మరోటి లేదు. జనాభా పెరిగితే రేపటి అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లలో కోత ఉండదన్న దురుద్దేశం ఇందులో దాగి ఉందనడంలో సందేహం లేదు. దక్షిణాది రాష్ట్రాల జనాభా పెరుగుదల రేటు గణనీయంగా తగ్గిన కారణంగా నియోజక వర్గాల పునర్విభజన జరిగితే, నష్టపోతాం కనుక జనాభాను పెంచాల్సి ఉందని,అందుకు మహిళలు ఎక్కువ మంది పిల్లలను కనాలని చంద్రబాబు నాయుడు సెలవిచ్చారు. ఎక్కడకు వెళ్లినా , కార్యక్రమం ఏదైనా జనాభా పెంచాల్సిన అవసరాన్ని నొక్కి చబుతున్నారు. ముగ్గురు అంతకన్నా ఎక్కువ మంది పిల్లలను కనే మహిళలకు, పిల్లలకు ప్రోత్సాహకాలను కూడా ప్రకటించారు. మూడవ సంతానానికి రూ.30 వేలు, నాల్గవ సంతానానికి రూ.40 వేలు నగదు సహాయం చేస్తామని, ఆర్థికాభివృద్ధి బాగుంటే మరింత ఎక్కువ ఇవ్వడానికి కూడా సిద్ధమని ప్రకటించారు. అసలు ఈ పిల్లలను కనడానికి కనీసం ఆస్పత్రి సౌకర్యాలు లేని ఎన్నో గ్రామాలు ఉన్నాయి. ముందుగా ఆయా గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలన్న ఆలోచన కూడా రావడం లేదు. ఎవరి ప్రయోజనాల కోసం మహిళలు ఎక్కువ మంది పిల్లలను కనాలో చెప్పాలి. పిల్లను కనడం వల్ల వచ్చే సౌలభ్యం ఏమిటో చెప్పాలి. ఈ ప్రోత్సాహకాలు ప్రకటించడం ద్వారా గ్రామీణ మహిళల కుటుంబాల్లో డబ్బు కోసం ఒత్తిడి పెరుగుతోంది. ఈ విషయం చంద్రబాబు గ్రహించినట్లు లేదు.ప్రోత్సాహకాలు మాత్రమే మహిళలు ఆరోగ్యంగా, గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి, పిల్లలు సురక్షితమైన వాతావరణంలో పెరగడానికి అవకాశాలు కల్పిస్తాయని భరోసా ఇవ్వగలరా అన్నది చెప్పాలి. కార్పొరేట్ సంస్థలకు చౌకగా శ్రామికులను సరఫరా చేయడానికి, మహిళలను ఇంటికి పరిమితం చేయడానికి మాత్రమే ఇది ఉపయోగ పడుతుంది. దేశ జనాభా ఇప్పటికే విపరీతంగా పెరిగింది. బాల్యం అంతా వెట్టిలో సాగుతోంది. జనాభా పెరుగుదల దేశంలో అసమానతలను పెంచింది. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, అభద్రత, హింస, అత్యాచారాలు, అశాంతి పెరిగినట్లుగా అన్ని గణాంకాలు,
నివేదికలు తెలియచేస్తున్నాయి. మహిళల విద్య, ఉపాధి, పౌష్టికతకు సంబంధించిన అంశాలలో వెనకబడుతున్నాం. ఇటువంటి దుర్భర పరిస్థితులలో ఎక్కువ మంది పిల్లల్ని కనండి అని సూచించడం ద్వారా గ్రామీణ కుటుంబాల్లో భారం మోపడం తప్ప మరోటి కాదు. పిల్లను కనడానికి సరైన ఆస్పత్రులు లేవు. పెంచడానికి సరైన భద్రత లేదు. పెంచిన తరవాత చదివించేం దుకు సరైన పాఠశాలలు లేవు. వారిని సమర్థులైన పౌరులుగా తీర్చిదిద్దడానికి అనువైన వాతావరణం లేదు.

# మధ్యప్రదేశ్‌లో ఘోర ప్రమాదం

ట్రాక్టర్ బోల్తా పడి ఆరుగురు మృతి మరో 40మందికి తీవ్ర గాయాలు




భోపాల్: మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. 50 మంది ప్రయాణికులతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడటంతో ఆరుగురు మరణించారు. 40 మందికిపైగా గాయపడ్డారు. ఈ ఘటన మధ్యప్రదేశ్, అనుప్పూర్ జిల్లా, గింగ్రి గ్రామ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పడానియా గ్రామానికి చెందిన 50 మందికి పైగా స్థానికులు ఒక మతపరమైన కార్యక్రమం కోసం బిజోరా గ్రామానికి ట్రాక్టర్‌లో బయల్దేరారు. వీరంతా వెనుక ట్రాక్టర్‌లో ఉన్నారు. ఈ క్రమంలో గింగ్రి గ్రామం వద్దకు రాగానే ట్రాక్టర్ ట్రాలీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ట్రాక్టర్‌లోని వారంతా ట్రాలీ కింద చిక్కుకుపోయారు. ఒకరిమీద ఒకరు పడిపోయి, తీవ్ర గాయాలపాలయ్యారు. ప్రమాద తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. ఈ ఘటనలో ఆరుగురు మరణించగా, 40 మందికిపైగా గాయపడ్డారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న స్తానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. స్థానికులు కూడా సహాయక చర్యల్లో పాల్గొన్నారు. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. వీరిలో 15 మంది పరిస్థితి విషమంగా ఉండటంతో జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. బాధితులకు చికిత్స కొనసాగుతోంది. ఈ ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. మరోవైపు ఈ ప్రమాదంపై మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల సాయం ప్రకటించారు. క్షతగాత్రులకు తగిన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

## ఖరీఫ్‌కు 22,348 క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధం

విజయనగరం:జిల్లాలో ఖరీఫ్ సాగుకు అవసరమైన 22,348 క్వింటాళ్ల వరి విత్తనాలను సిద్ధం చేసినట్లు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఇందులో 8,883 క్వింటాళ్ల వరి విత్తనాలను గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై అందజేస్తున్నట్లు చెప్పారు. అలాగే పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను ఎస్టీ రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 50 శాతం రాయితీతో పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు.రైతులకు నాణ్యమైన విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు సకాలంలో అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి పేర్కొన్నారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో 802 టార్పాలిన్లు, 14 ఆయిల్ ఇంజన్లను లబ్దిదారులకు పంపిణీ చేశారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంత్రి సాలూరు మెంటాడ వీధిలోని 1, 2 వార్డుల్లో కాలువలు, వీధుల పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రజలతో మమేకమవుతూ వీధుల్లో అరుగులపై కూర్చొని మహిళలతో కలిసి కాఫీ తాగారు. ఇంధన పొదుపు కార్యక్రమంలో భాగంగా మంత్రి స్కూటర్‌పై కార్యక్రమ స్థలానికి చేరుకోవడం ఆకర్షణగా నిలిచింది. అనంతరం ఖరీఫ్-2026 సీజన్‌కు రైతులకు భారీ ఎత్తున రాయితీ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే ప్రకృతి వ్యవసాయ కార్యాచరణ పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. సాలూరు నియోజకవర్గ రైతులకు 8,100 ఖఓఆ÷ూ కిట్లను కూడా పంపిణీ చేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నేల సారవంతత పెరగడంతో పాటు భూమిలో తేమ నిల్వ ఉండి, రైతుల ఆదాయం పెరగడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.

## కర్నాటక సిఎల్‌పి నేతగా డికె ఏకగ్రీవ ఎన్నిక



బెంగళూరు:కర్ణాటక కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ నేతగా ఎన్నికైన డీకే శివకుమార్ జూన్ 3న ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ మేరకు ఆయన ప్రమాణ తేదీ అధికారికంగా ఖరారైంది. జూన్ 3న కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేస్తారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం సాయంత్రం ప్రకటించారు. సీఎల్‌పీ నేతగా డీకే శివకుమార్ ఎన్నికైన అనంతరం మీడియాతో ఆ వివరాలను కేసీ వేణుగోపాల్ పంచుకున్నారు. సీఎల్‌పీ నేతగా డీకే ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు చెప్పారు. డీకే పేరును కాంగ్రెస్ అధిష్టానం సూచించగా, తొలుత సిద్ధరామయ్య, ఆ తర్వాత పరమేశ్వర ఆయన పేరును సీఎల్‌పీ సమావేశంలో ప్రతిపాదించారని, ఏకగ్రీవంగా దీనికి ఎమ్మెల్యేలు ఆమోదం తెలిపారని వివరించారు. ముఖ్యమంత్రి మార్పు కాంగ్రెస్ పార్టీకి సమస్య అవుతుందని అంతా భావించారనీ, అయితే తమదంతా ఒక కుటుంబమని, అంతా ఏకగ్రీవంగా ఈ ఎన్నికను ఆమోదించడం పార్టీకి గర్వకారణమని అన్నారు. 2028లోనూ నాయకులందరికీ సపోర్ట్‌తో కర్ణాటకలో కాంగ్రెస్ తిరిగి అదికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాలతో సిద్ధరామయ్య ఈనెల 28న ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి డీకే శివకుమార్ సీఎం పగ్గాలు చేపట్టేందుకు మార్గం
సుగమం చేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరిగేంతవరకూ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని సిద్ధరామయ్యకు గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ సూచించారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల పాలన పూర్తి చేసుకుంది. ఇదిలావుంటే అంతకుముందు కర్ణాటకలో నాయకత్వ మార్పు పక్రియలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆ పార్టీ శాసనసభా పక్ష నేతగా డీకే శివకుమార్
ఎన్నికయ్యారు. శనివారం సాయంత్రం విధాన సౌధలో జరిగిన సీఎల్పీ సమావేశంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు డీకేను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. శివకుమార్ పేరును మాజీ సీఎం సిద్ధరామయ్య ప్రతిపాదించగా సీనియర్ నేత పరమేశ్వర బలపరిచినట్లు తెలిసింది. మరోవైపు జూన్ 3న నూతన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేయనున్నట్లు కర్ణాటక కాంగ్రెస్ ఇప్పటికే ప్రకటించింది.

ఉత్తేజిత దినపత్రిక



## గుక్కెడు నీటికోసం గ్రామప్రజలు అవస్థలు పట్టించుకోని అధికారులు

### నీటి ట్యాంకర్లు పంపిన బుట్ట రేణుక



**గోనెగండ్ల ఉత్తేజిత న్యూస్**

:- గోనెగండ్ల మండల పరిధిలోని గంజహల్లి గ్రామంలో తీవ్ర మంచినీటి ఎద్దడి నెలకొనడంతో గ్రామ ప్రజలు వేసవి కాలంలో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గ్రామానికి చెందిన వడ్ల నరసింహ ఆచారి , దాసన్న రమేష్ గ్రామ ప్రజల తరపున వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్త, మాజీ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి బుట్టా రేణుక దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల సమస్యల పట్ల ఎల్లప్పుడూ స్పందించే శ్రీమతి బుట్టా రేణుక వెంటనే ఈ విషయాన్ని బుట్టా ఫౌండేషన్ అధినేత శ్రీ బుట్టా శివ నీలకంఠ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న వెంటనే స్పందించిన శ్రీ బుట్టా శివ నీలకంఠ బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గంజహల్లి గ్రామానికి మంచినీటి ట్యాంకర్లను ఏర్పాటు చేసి తాగునీటి సరఫరా చేపట్టించారు. దీంతో గ్రామ ప్రజలకు తాత్కాలిక ఉపశమనం లభించింది. తమ సమస్యను వెంటనే గుర్తించి స్పందించిన శ్రీమతి బుట్టా రేణుకకి, అలాగే సేవా కార్యక్రమాలతో ప్రజలకు అండగా నిలుస్తున్న బుట్టా ఫౌండేషన్ అధినేత శ్రీ బుట్టా శివ నీలకంఠకి గ్రామ ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# గో హింసకు అడ్డుకట్ట వేయాలి

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూర్ మే 30**



గోవు హింసకు అడ్డుకట్ట వేయాలని మస్జిద్-ఏ-మహబూబ్ ముతవల్లి సౌదీ చాంద్ ఆవేదన. ప్రతి మనిషికి గోవు తల్లి లాంటిది గోవును సంరక్షించుకోవడం మన బాధ్యత అనిమస్జిద్-ఏ-మహబూబ్ ముతవల్లి సౌదీ చాంద్ పేర్కొన్నారు. గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని మస్జిద్-ఏ- మహబూబ్ కమిటీ ముతవల్లి, షేహెరే జమీయత్-ఏ-అహ్లెహదీస్ నాయబ్ అమీర్ సౌదీ చాంద్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సౌదీ చాంద్ మాట్లాడుతూ అవును జాతీయ జంతువుగా ప్రకటిస్తే, గో సంరక్షణ చట్టాల్లో ఏకరూపతకు దారితీయడంతోపాటు గో సంరక్షకుల ముసుగులో సాగుతున్న హింసకు అడ్డుకట్ట పడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం పులికి జాతీయ జంతువుగా గుర్తింపు ఉందని, గోమాత అయినటువంటి ఆవుకు అటువంటి స్థాయి ఏదీ లేదని, ఆవుకు జాతీయ జంతువు హోదా కల్పించాలని డిమాండు చేశారు. ఆవును బలి ఇవ్వాలని ఏ మత గ్రంథమూ చెప్పడం లేదని, తోటి పౌరులకు బాధ కలిగించే చర్యలకు పాల్పడాల్సిన పనిలేదని పేర్కొన్నారు. జాతీయ జంతువుగా ప్రకటిస్తే ఆవును కొనడం కానీ అమ్మడం కానీ నేరం అని అందరికీ తెలుస్తుందన్నారు. గోసంరక్షణకు అందరూ పాటుపడాలని పిలుపు సౌదీ పిలుపునిచ్చారు.
ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలని గురువారం నాడు బక్రీద్ ద్ పండుగ సందర్భముగా నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణం. నందికొట్కూరు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ కూడా పోలీసు అధికారుల ఆదేశాల మేరకు అహింస కార్యక్రమాలు ఎక్కడా జరగలేదని సౌదీ చాంద్ చెప్పుకొచ్చారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ముస్లింలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మునిసిపాలిటీ పరిధిలోని ఈద్గాల వద్ద ప్రార్థనల అనంతరం ముస్లింలు పెద్దలు గోవులను కుర్బానీ చేయవద్దని ప్రకటించడం జరిగిందన్నారు. ఈ మేరకు సందర్భంగా పలువురు యువకులు మాట్లాడుతూ.. దేశంలో మత సామరస్య వాతావరణం కొనసాగాలంటే కుల మతాలకు అతీతంగా గో సంరక్షణకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని చాంద్ పిలుపునిచ్చారు. 'హిందూ, ముస్లిం భాయీ భాయీ' అంటూ విజ్ఞప్తి చేయడం జరిగింది. నందికొట్కూరు నియోజకవర్గం వివిధ గ్రామాలకు చెందిన ముస్లింల ఆవేదన ఒకటి గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించాలి. అనే నినాదం వివిధ గ్రామాలలోని ఈద్గ ప్రార్థనల అనంతరం బోధకులు అయినటువంటి ఆఫీజ్ సబ్ ఒకటే స్థానిక ఈద్గా వద్ద సామూహిక ప్రార్థనల అనంతరం.. ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలని ఎవరు మన ముస్లింలు కూడా మనమందరం కలిసికట్టుగా గోవులను కుర్బానీ ఇవ్వొద్దు.. పొట్టేళ్లనుమాత్రమే కుర్బానీ ఇవ్వండి అని మత పెద్దలు ప్రకటించడం జరిగిందని సౌదీ చాంద్ ఈ సందర్భంగా తెలిపారు. మన ముస్లిం పెద్దల ఆజ్ఞా ప్రకారం మన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పిలుపుమేరకు గోమాతను
జాతీయ జంతువుగా ప్రకటించాలని మన నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య. నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు నాయుడు. మన ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారాలతో గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించాలని మన నందికొట్కూరు నియోజకవర్గంలోని ముస్లిం సోదరుల యొక్క విజ్ఞప్తి ఏ రాజకీయ పార్టీలు, మతతత్వ పార్టీలు దీని ద్వారా లబ్ది పొందడానికి అవకాశం ఉండదన్నారు. ముస్లిం సమాజం కూడా ఆవును వధించకూడదు (కోయకూడదని) నిర్ణయించారని అన్నారు. ఆవును జాతీయ జంతువుగా ప్రతికంచాలని డిమాండ్ చేస్తున్నట్టు సౌదీ చాంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తత్తూరు హనీఫ్. అబ్దుల్ రహిమాన్. అబ్దుల్లా. మహబూబ్ బాషా పాల్గొన్నారు.

## ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ




**తిరుపతి స్టాఫ్ రిపోర్టర్ ఉత్తేజిత మే 30.**

మే నెల 31 " ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం" సందర్భంగా ఈరోజు ఉదయంతిరుపతి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించడమైనది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం నుండి శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వి. బాల కృష్ణ నాయక్ జండా ఊపి ప్రారంభించారు. పొగాకువ్యతిరేక నినాదాలతో ర్యాలీ నిర్వహించి శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాల కూడలి వద్ద మానవహారం నిర్మించి విద్యార్థినులు, సిబ్బంది మరియు జిల్లా అధికారులతో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి పొగాకు నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డి ఎం హెచ్ ఓ మాట్లాడుతూ పొగాకు వినియోగం వల్ల నోటి క్యాన్సరు,ఊపిరితిత్తుల క్యాన్సర్ తో పాటు ఇతర ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని కావున ప్రజలు పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. పొగాకు సేవించే వారికే కాకుండా వారి చుట్టూ ఉన్నవారు కూడా పరోక్ష ధూమపానం వల్ల క్యాన్సర్ మరియు ఇతర ఆరోగ్య సమస్యలకు గురి అయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. పొగాకు అలవాటు ఉన్నవారు వెంటనే ఆ వ్యసనం నుండి విముక్తి పొందేందుకు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రూప్ కుమార్ , డిపిఎమ్ఓ డాక్టర్ చత్ర ప్రకాష్ రెడ్డి, , స్టాటిస్టికల్ ఆఫీసర్ నాగేంద్ర కుమార్, డిప్యూటీ డెమో బలరామరాజు, జిల్లా ప్రోగ్రాం అధికారులు, కార్యాలయ సిబ్బంది, రత్నాకర్, మోహన్ బాబు,మలేరియా సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు,( మగ, ఆడ), ఎన్ సి డి విభాగం సిబ్బంది, పోలీస్ శాఖకు చెందిన ఈగల్ టీం సభ్యులు, శ్రీ పద్మావతమ్మ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ?

# ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం..

### రేణిగుంటలో ఆకాంక్ష సంస్థ ఆధ్వర్యంలో భారీ అవగాహన ప్రదర్శన..

**రేణిగుంట ఉత్తేజిత మే 30.**




ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని రేణిగుంట పట్టణంలో ప్రజలకు పొగాకు మహమ్మారి వల్ల కలిగే అవగాహన కల్పించేందుకు ఆకాంక్ష సేవా సంస్థ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన మరియు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత డాక్టర్ మర్దాల రవిబాబు ఆధ్వర్యంలో ఈ అవగాహన ప్రదర్శన ఘనంగా ప్రారంభమైనది. రేణిగుంట పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రారంభమై ఈ ప్రదర్శన ప్రధాన వీధుల గుండా సాగుతూ బస్టాండ్ కూడలి వరకు చేరుకుంది. ప్రదర్శనలో పాల్గొన్న వారు పొగాకు వల్ల కలిగే అనర్థాలు వివరిస్తూ నినాదాలు పలకలను చేత భూని అవగాహన నినాదాలు చేశారు. అనంతరం బస్టాండ్ కూడలి వద్ద అందరూ కలిసి ఒక భారీ మానవహారం గా ఏర్పడి పొగాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి శ్రీ వెంకటేశ్వర కళాశాలకు చెందిన మానవ వనరుల అభివృద్ధి విభాగం మరియు సామాజిక సేవ విభాగం విద్యార్థులు యాజమాన్యం సంయుక్తంగా నిర్వహించారు. అలాగే ఈ ప్రదర్శనలో ప్రముఖ క్యాన్సర్ నివారణ మరియు పరిశోధన సంస్థ భాగ్యస్వామ్యంగా ఉంది. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు కామరాజు, స్థానిక ఆరోగ్య కార్యకర్తలు మరియు ప్రవేట్ వైద్యుని వైద్య నిపుణులు జనార్దన్ తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ జనార్దన్ మాట్లాడుతూ పొగాకు వాడటం వల్ల కలిగే ప్రాణాంతక నష్టాలను వివరించారు. పొగాకు వాడకం మరియు ధూమపానం చేయడం వల్ల కేవలం ఆ అలవాటు ఉన్న వారి ఆరోగ్యమే కాకుండా వారు వదిలే పొగ వల్ల వారి పక్కన ఉండే ఇతరుల ఆరోగ్యం కూడా తీవ్రంగా దెబ్బతింటుంది. కుటుంబంలో ఒకరు
ధూమపానానికి బానిసలు అయితే ఆ ప్రభావం పిల్లలు మహిళలపై పడుతుంది. కాబట్టి ప్రతి ఒక్కరూ పొగాకు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణాన్ని కి తోడ్పడాలి అని ఆయన పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో కూడా గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి మరెన్నో అవగాహన సదస్సులు నిర్వహించి పొగాకు రహిత సమాజం కోసం కృషి చేస్తామని ఆకాంక్ష సమస్త ప్రతినిధి స్పష్టం చేశారు.

## పోటీ ప్రపంచంలో ఆంగ్లభాషపై ప్రతి ఒక్కరూ పట్టు సాధించాలి :- ఎంఈఓ -2 నిలకంఠ

**ముగిసిన యుటిఎఫ్ ఉచిత ఇంగ్లీషు శిక్షణ తరగతులు**

**గోనెగండ్ల ఉత్తేజిత న్యూస్ :-**






కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నీయోజకవర్గం మండల కేంద్రమైన గోనెగండ్లలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఇంగ్లీషు శిక్షణ తరగతులు ముగిశాయి. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆంగ్లభాషపై ప్రతి ఒక్కరూ పట్టు పెంపొందించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని గోనెగండ్ల ఎంఈఓ - 2 నీలకంఠ అన్నారు. యూటీఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో సీనియర్ ఉపాధ్యాయులు రామన్ సహకారంతో నెల రోజులుగా నిర్వహించిన ఉచిత ఇంగ్లీషు శిక్షణ శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ -2 నీలకంఠ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గుమ్మల బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచంలో ప్రతి ఒక్కరికి ఆంగ్ల భాష పై పట్టు అవసరమన్నారు. ముఖ్యంగా విద్యార్థిని విద్యార్థులు ఇలాంటి ఉచిత శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకొని ఇంగ్లీష్ భాషలో పట్టు సాధించడం ద్వారా పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించడంతోపాటు భవిష్యత్తులో ఉన్నత స్థానం పొందడానికి దోహదపడుతుందని అన్నారు. వేసవి సెలవుల్లో ఆటపాటలతో కాలం గడపకుండా ఈ శిక్షణ శిబిరానికి విద్యార్థిని విద్యార్థులు హాజరు కావడం మంచి విషయమని అన్నారు. అనంతరం యుటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్న సీనియర్ ఉపాధ్యాయులు రామన్ ను అభినందించడంతోపాటు శాలువా పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎస్ నరసింహులు మండల గౌరవ అధ్యక్షులు లింగన్న ప్రధాన కార్యదర్శి కేశన్న నాయకులు రవికుమార్ పాల్గొన్నారు.

## పాతవీరపురం ద్రౌపదీ దేవి తిరునాళ్ళలో పాల్గొన్న ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి... గ్రామ అభివృద్ధికి పూర్తి సహకారం..

**ఏర్పేడు ఉత్తేజిత మే 30**



మండలం పాతవీరపురం గ్రామంలో అత్యంత వైభవంగా జరుగుతున్న శ్రీ ద్రౌపదీ దేవి తిరునాళ్ళ వేడుకల్లో మన ప్రియతమ నాయకులు, స్థానిక శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే కి ఏర్పేడు మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు పేరం నాగరాజ నాయుడు , ప్రముఖ నాయకులు బత్తల నాయుడు మరియు పాతవీరపురం గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతవీరపురం గ్రామ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, గ్రామ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఐపిఎల్‌లో అరుదైన ఘనత

**వరుసగా రెండుసార్లు హిట్ వికెట్‌గా సాయిసుదర్శన్**

చండీఘడ్: ఐపీఎల్-2026 సీజన్‌లో రెండుసార్లు సాయిసుదర్శన్ హిట్ వికెట్‌గా వెనుతిరిగాడు. వరుస రెండు మ్యాచుల్లో ఇది జరిగింది. బెంగుళూరు, గుజరాత్‌లతో జరిగిన మ్యాచ్‌లలో సాయిసుదర్శన్ హిట్ వికెట్‌గా వెనుతిరిగాడు. ఇకపోతే క్వాలిఫయర్-2లో గుజరాత్ టైటాన్స్ మరోసారి సత్తాచాటింది. రాజస్థాన్ రాయల్స్ నిర్దేశించిన 215 పరుగుల భారీ లక్ష్యాన్ని 3 వికెట్లు కోల్పోయి ఛేదించి, బెంగళూరుతో తుదిపోరుకు అర్హత సాధించింది. అయితే.. ఈ మ్యాచ్‌లో జీటీ ఓపెనర్ సాయి సుదర్శన్ ఔటైన తీరే చర్చనీయాంశమవుతోంది. బ్రిజేష్ శర్మ బౌలింగ్‌లో థర్డ్‌మ్యాన్ వైపు బౌండరీ కొట్టిన అనంతరం అతడి చేతిలోని బ్యాట్ జారి నేరుగా వికెట్లను తాకడంతో హిట్ వికెట్‌గా వెనుదిరిగాడు. అంతకుముందు క్వాలిఫయర్-1లో జరిగిన మ్యాచ్‌లోనూ ఆర్సీబీపై ఇదే తరహాలో ఔటయ్యాడు. దీంతో ఐపీఎల్‌లో వరుసగా 2 ఇన్నింగ్స్‌ల్లో హిట్ వికెట్‌గా వెనుదిరిగిన తొలి బ్యాటర్‌గా కోరుకుని రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు సాయి సుదర్శన్. మ్యాచ్ అనంతరం తాను ఔటైన తీరుపై సాయి సుదర్శన్‌కు ఓ ప్రశ్నకు అతడు సరదాగా స్పందించాడు. 'ఇకపై బ్యాట్ చేతికి అతుక్కుని ఉండేలా గ్రిప్ టెక్నిక్‌లు ఏవైనా ఉన్నాయేమో ప్రయత్నించాలి' అని నవ్వుతూ సమాధానమిచ్చాడు. ఈ మ్యాచ్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో ఇన్నింగ్స్ ఆరంభించిన సాయి సుదర్శన్.. తొలి వికెట్‌కు 167 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. ఐపీఎల్ ప్లేఆఫ్స్ చరిత్రలో ఏ వికెట్‌కైనా ఇదే అత్యధికం. గతంలో చెన్నై సూపర్ కింగ్స్ తరపున మైక్ హస్సీ, మురళీ విజయ్ 159 పరుగులు జోడించగా.. ఆ రికార్డును వీరు అధిగమించారు. అంతేకాకుండా గిల్-సుదర్శన్ జోడీ మరో ఘనతనూ సొంతం చేసుకుంది. టీ20 క్రికెట్ చరిత్రలో అత్యధికంగా 100కు పైగా భాగస్వామ్యాలు నెలకొల్పిన జోడీగా అవతరించింది. వీరిరువురూ 11 సెంచరీ భాగస్వామ్యాలతో.. క్రిస్ గేల్-కోహ్లీ, బాబర్ ఆజమ్-మహ్మద్ రిజ్వాన్, డివిలియర్స్-కోహ్లీ జోడీలను వెనక్కి నెట్టారు. క మ్యాచ్ విషయానికొస్తే.. 215 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో గిల్(53 బంతుల్లో 104) అద్భుత శతకంతో మెరిశాడు. మరోవైపు సాయి సుదర్శన్ 32 బంతుల్లో 58 పరుగులతో చెలరేగాడు. వీరి దూకుడుకు రాజస్థాన్ బౌలర్లు పూర్తిగా చేతులెత్తేశారు.

## ఏసీబీకి పట్టుబడ్డ సర్వ శిక్ష అభియాన్ ఏఈ.

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు మే30**



నంద్యాల జిల్లా సర్వ శిక్షణ అభియాన్ ఎ ఈ రూ. 40 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి మెరుపు దాడుల్లో పట్టుబడ్డారు. శనివారం ఏసీబీ డిఎస్పి సోమన్న ఆధ్వర్యంలోసిఐ కృష్ణయ్యల మెరుపు దాడిలో నందికొట్కూరు మండల పరిధిలోని బ్రాహ్మణ కొట్కూర్ నేషనల్ హైవే 340 సమీపన నంద్యాల జిల్లా సర్వ శిక్షణ అభియాన్ ఏ ఈ తెలుగు రమేష్ క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్‌కు లంచం డిమాండ్ చేసిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు మాట్లాడుతూ సివిల్ కాంట్రాక్టర్ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ కారులో నగదు స్వీకరిస్తుండగా రైట్ హ్యాండ్ గా పట్టుకోవడం జరిగిందన్నారు. జూపాడుబంగ్లా, మిడుతూరు పాఠశాల భవనాల పనులకు సంబంధించిన కేసు. రూ. 41.6 లక్షల బిల్లుల ప్రక్రియలో సొమ్ము స్వాధీనం చేసుకోవడం జరిగిందని మీడియాకు తెలిపారు. కాబట్టి ఎవరైనా లంచం అడిగినట్లు తెలిసిన వెంటనే ఏసీబీ అధికారులకు తెలియజేయాలని సూచించారు.

## గ్యాస్ వాడకం పై అవగాహన

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు మే 30**




జ్వాల దినోత్సవ సందర్భంగా నంది కొట్కూరు మండల పరిధిలోని దామగట్ట గ్రామంలో 30-5-26 వలేదాని అశోక గ్యాస్ ఏజెన్సీ వారిచే గ్యాస్ అవగాహన సంస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్యాస్ కి సంబందించిన పద్దతులు మరియు గ్యాస్ వాడకం మరియు కేజీ జాగ్రత్తలను అశోక గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు అశోక వర్ధన్ మరియు సిబ్బంది పాల్గొని అవగాహన కలిగించారు.
ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎం . సుశీల రత్నం మరియు గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

ఉత్తేజిత దినపత్రిక

# అధిక వడ్డీ ఆశతో డబ్బులేస్తున్నారా?




బ్యాంకులు అధిక వడ్డీ ఆఫర్ చేస్తున్నాయని మీరు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తున్నారా? అయితే, ఎఫ్‌డీల్లోనూ కొన్ని ప్రతికూలతలు ఉన్నాయి. అసలు ఫిక్స్‌డ్ డిపాజిట్ వల్ల ఎలాంటి నష్టాలు ఉంటాయి, ఎందుకు బ్యాంకులో డబ్బులు దాచుకోకూడదు అనేందుకు 5 రకాల కారణాలను ఇప్పుడు మనం తెలుసుకుందాం.

అధిక వడ్డీ ఆశతో బ్యాంకులో డబ్బులేస్తున్నారా? కష్టపడి సంపాదించిన డబ్బులను ఎలాంటి రిస్క్ లేకుండా అధిక వడ్డీ అందించే పెట్టుబడి మార్గంలో పెట్టి రాబడి అందుకోవాలని చాలా మంది భావిస్తుంటారు. అలాంటి వారు ముందుగా ఆలోచించేంది బ్యాంకులు అందించే ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాలే. ఇటీవలి కాలంలో బ్యాంకులు సైతం గరిష్ఠ వడ్డీ రేట్లు అందిస్తున్నాయి. కొన్ని స్పెషల్ స్కీమ్స్ ద్వారా అదనపు వడ్డీని అందిస్తున్నామని చెబుతున్నాయి. దీంతో ఆయా పథకాల్లో తమ డబ్బులను డిపాజిట్ చేస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. ప్రస్తుతం చాలా బ్యాంకుల్లో 7 శాతానికిపైగా వడ్డీ రేట్లు ఉన్నాయి. మంచి రాబడి కోరుకునే వారు ఇప్పుడు డిపాజిట్ చేయడానికి మంచి సమయంగా చెప్పవచ్చు. కొన్ని చిన్న బ్యాంకుల్లో ఏకంగా 9 శాతం మేర వడ్డీ రేట్లు ఉన్నాయి. అయితే, బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసే ముందు వాటిలో ఉండే ప్రతికూలతలు సైతం తెలుసుకోవాలి. చాలా మందికి పోస్ట్ ట్యాక్స్ రిటర్న్స్ అనేవి 5 శాతం వడ్డీతో అందుతాయి. అలాగే ఫిక్స్‌డ్ డిపాజిట్ అమౌంట్ పై వచ్చే వడ్డీ పైనా ట్యాక్స్ పడుతుంది. రాబడి తగ్గిపోతుంది పన్నుల కారణంగా మీ చేతికి అందే సంపద మొత్తం చాలా తగ్గిపోతుందని చెప్పవచ్చు. ద్రవ్యోల్బణ ప్రకారం చూసుకుంటే దీర్ఘకాలంలో మీ రాబడిలో భారీగా కోత పడుతుంది.

ఉదాహరణకు పైన పేర్కొన్నట్లు 5 శాతం రిటర్న్స్ అనేవి యావరేజ్ కన్స్యూమర్ ఇన్‌ఫ్లేషన్ రేటుతో పోల్చినట్లయితే చాలా తక్కువ అని చెప్పవచ్చు. ఇది దీర్ఘకాలంలో మీ సంపదను మరింత తగ్గిస్తుంది. ట్యాక్స్ సేవింగ్స్‌కు సరైనది కాదు ఇన్‌కమ్ ట్యాక్స్ యాక్ట్‌లోని సెక్షన్ 80సీ కింద ట్యాక్స్ సేవింగ్స్ కోసం చాలా మంది 5 ఏళ్ల మెచ్యూరిటీ టెన్యూర్ ఫిక్స్‌డ్ డిపాజిట్లలో పెట్టుబడి పెడుతుంటారు. సెక్షన్ 80 సీ ద్వారా ట్యాక్స్ డిడక్షన్ లిమిట్ రూ. 1.5 లక్షల వరకు మాత్రమే ఉంటుంది. ఫిక్స్‌డ్ డిపాజిట్ల ద్వారా వచ్చే రాబడి ట్యాక్స్ పరిధిలోకి వస్తుంది కాబట్టి ట్యాక్స్ సేవింగ్స్ కోసం ఎఫ్‌డీ చేయడం అంత ప్రభావవంతమైన ఎంపిక కాదని చెప్పవచ్చు. ముఖ్యంగా శాలరీ అందుకునే వారు, ఇతర వేతన జీవులు బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు కాకుండా పీపీఎఫ్, వీపీఎఫ్, ఎన్‌పీఎస్ వంటి ఇతర ట్యాక్స్ ఫ్రీ రిటర్న్స్ ఇచ్చే పథకాలను ఎంచుకోవడం ఉత్తమం. రూ.5 లక్షల వరకే బీమా కవరేజీ మీరు బ్యాంకులో ఎంత మొత్తంలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినా మీకు రూ.5 లక్షల వరకే ఇన్స్యూరెన్స్ భద్రత ఉంటుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్‌బీఐ ఆధ్వర్యంలోని డీఐసీజీసీ ఇన్స్యూరెన్స్ అనేది రూ.5 లక్షల వరకు బీమా రక్షణ కల్పిస్తుంది. అయితే, పోస్టాఫీసు స్కీమ్ పీపీఎఫ్, ఎన్ఎస్‌సీ, కేవీపీ వంటివి గ్యారంటీ రిటర్న్స్ ఇస్తాయి. వాటికి కేంద్ర ప్రభుత్వ హామీ ఉంటుంది. అలాగే ట్యాక్స్ బెనిఫిట్స్ కూడా ఉంటాయి. దీర్ఘకాలం పాటు ఇన్వెస్ట్ చేసి మంచి రాబడి కోరుకునే వారికి ఎఫ్‌డీ సరైన మార్గం కాదనే చెప్పాలి. బ్యాంక్ ఎఫ్‌డీతో పోలిస్తే పీపీఎఫ్, వీపీఎఫ్, ఎన్‌పీఎస్ అనేవి ట్యాక్స్ ఫ్రీ రిటర్న్స్ అందిస్తాయి. అలాగే పలు మ్యూచువల్ ఫండ్స్ సైతం దీర్ఘకాలంలో ఎక్కువ రాబడిని ఇస్తాయి. అయితే, మూచ్యువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసే వారు నిపుణుల సలహాలు తీసుకుని ఇన్వెస్ట్ చేయాలి.

# ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి అప్‌డేట్ చేయాల్సిందేనా?

మీరు ఆధార్ కార్డు తీసుకొని 10 సంవత్సరాలకుపైగా అయిందా? అప్పటి నుంచి దాంట్లో ఏం అప్‌డేట్ చేయలేదా? మరి 10 సంవత్సరాల వరకు అప్‌డేట్ చేయకుంటే ఇప్పుడు చేయాలని పలు కథనాలు వస్తున్న సంగతి తెలిసిందే. మరి ఇలాంటి వారు కచ్చితంగా ఆధార్ కార్డును అప్‌డేట్ చేయాల్సిందేనా? దీనిపై యూఐడీఏఐ ఏం చెబుతోంది చూద్దాం. ఆధార్ కార్డు.. భారత పౌరులందరికీ ఇది తప్పనిసరి. ఇది ఎంతో ముఖ్యమైన డాక్యుమెంటు అన్న సంగతి తెలిసిందే. ఆధార్ కార్డులో అన్ని వివరాలు సరిగా ఉండాలి. పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరు, అడ్రస్ ఇలా అన్నీ సరిగా ఉన్నప్పుడే ప్రయోజనాలు దక్కుతాయి. ఇప్పుడు దాదాపు అన్ని ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు కూడా ఆధార్‌తో ముడిపడి ఉంటున్నాయి. ఆ ఆధార్‌లో అడ్రస్ సరిగా లేనప్పుడు పాన్ కార్డు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్, బ్యాంక్ స్టేట్‌మెంట్స్ వంటివి కూడా పొందలేరు. అయితే మరి ఆధార్ కార్డులో ఏదైనా డాక్యుమెంట్ అప్‌డేట్ చేసుకునేందుకు డిసెంబర్ 14 వరకు ఉచితం అన్న సంగతి తెలిసిందే. ఏమైనా మార్పులుంటే ఈ లోపే చేసుకోవడం ఉత్తమం అని చెబుతున్నారు. భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ కూడా ఆధార్ కార్డు అప్‌డేట్ చేసుకోవాలని భారత పౌరులకు సూచిస్తోంది. ఇంకా పదేళ్ల కిందట ఆధార్ కార్డు పొందిన వారు, అప్పటి నుంచి ఒక్కసారి కూడా అప్‌డేట్ చేయకుంటే చేసుకోవాలని సూచన చేస్తోంది. అయితే ఇది తప్పనిసరి మాత్రం ఏం కాదని స్పష్టం చేసింది. కానీ.. అప్‌డేట్ చేసుకుంటే మంచిదని ప్రోత్సహిస్తూ వస్తోంది.



ఆధార్ కార్డు తీసుకొని చాలా ఏళ్లయిందనుకుందాం. మీరు ఈ మధ్యలో ఊరు మారినా, ప్రాంతం మారినా, సిటీకి వెళ్లినా.. అడ్రస్ మారుతుంది. అప్పుడు ఆధార్ కార్డులో కూడా అడ్రస్ మార్చుకోవడం ఉత్తమం. అడ్రస్ సరిగా లేకుంటే పాన్ కార్డు, ఆధార్, పాస్‌పోర్ట్ సహా బ్యాంక్ స్టేట్‌మెంట్లు వంటివి కూడా పొందలేరు.

ఆన్‌లైన్‌లో ఆధార్ కార్డుకు సంబంధించి ఇంకా ఆధార్ కార్డుకు సంబంధించి ఏదైనా అనుమానం/సందేహాలు ఉంటే 1947 నంబర్‌కు కాల్ చేయొచ్చు. ఇది టోల్ ఫ్రీ నంబర్. దాదాపు అన్ని భాషల్లో కస్టమర్ సర్వీస్ ప్రతినిధులు అందుబాటులో ఉంటారు. ఆధార్ కార్డులో అడ్రస్ అప్‌డేట్ చేసుకునేందుకు గుర్తింపు, అడ్రస్ కోసం.. రేషన్ కార్డు, ఓటర్ ఐడీ కార్డు లేదా ఏదైనా ఐడెంటిటీ కార్డు ఉంటే సరిపోతుంది. కేవలం ఐడెంటిటీ కోసమైతే పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, 10 మెమో ఉండాలి. కేవలం అడ్రస్ అప్‌డేట్ కోసం ఎలక్ట్రిసిటీ/వాటర్/గ్యాస్ బిల్ (గత 3 నెలలవి), బ్యాంక్/పోస్టాఫీస్ పాస్‌బుక్, రెంట్/లీజ్/లైసెన్స్ అగ్రిమెంట్ ఏదైనా సరిపోతుంది. అయితే ఆన్‌లైన్ నుంచి అడ్రస్, డాక్యుమెంట్లు మాత్రమే అప్డేట్ చేసుకోవచ్చు. ఇతర సేవల కోసం ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ కేంద్రాలకు వెళ్లాల్సి ఉంటుంది. మొబైల్ నంబర్ అప్‌డేషన్ కోసం ఏ డాక్యుమెంట్లు కూడా అవసరం లేదు.

# బంపర్ బొనాంజా.. డిపాజిట్ వడ్డీ రేట్లు భారీగా పెంచిన దిగ్గజ బ్యాంక్..

ప్రైవేట్ రంగానికి చెందిన దిగ్గజ బ్యాంకు అదిరిపోయే శుభవార్త ప్రకటించింది. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను భారీగా పెంచుతున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం ఇవాళ్టి నుంచే (డిసెంబర్ 11) అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. ఇటీవల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచుతున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో.. ఈ బ్యాంకు శుభవార్త చెప్పడం విశేషం.

దిగ్గజ బ్యాంకు.. కోటక్ మహీంద్రా బ్యాంకు కీలక ప్రకటన చేసింది. ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రేట్లను పెంచేసింది. ఎంపిక చేసిన టెన్యూర్లపై ఇది వర్తిస్తుంది. రూ. 2 కోట్లకు లోబడిన బ్యాంక్ డిపాజిట్లపై వడ్డీ రేట్ల పెంపు ఉంటుందని బ్యాంక్ తన అధికారిక వెబ్‌సైట్‌లో వెల్లడించింది. 2023, డిసెంబర్ 11 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. కోటక్ మహీంద్రా బ్యాంకు ఇప్పుడు జనరల్ సిటిజెన్లకు 2.75 శాతం నుంచి 7.25 శాతం వడ్డీ రేట్లు ఆఫర్ చేస్తోంది. 15-30 రోజుల టెన్యూర్‌పై జనరల్ సిటిజెన్స్‌కు 3 శాతం, సీనియర్ సిటిజెన్లకు 3.50 శాతం వడ్డీ లభిస్తుంది. 31-45 రోజుల డిపాజిట్లపై వరుసగా 3.25 శాతం, 3.75 శాతం వడ్డీ వస్తుంది. అన్ని టెన్యూర్లపైనా సీనియర్ సిటిజెన్లకు సాధారణ ప్రజల కంటే 50 బేసిస్ పాయింట్ల మేర అదనంగా వడ్డీ వస్తుంది. 181-269 రోజుల టెన్యూర్ పై సాధారణ ప్రజలకు 6 శాతం, సీనియర్ సిటిజెన్లకు 6.50 శాతం మేర వడ్డీ లభిస్తుంది. 365 రోజుల నుంచి 389 రోజుల డిపాజిట్‌పై సాధారణ ప్రజలకు 7.10 శాతం,




సీనియర్ సిటిజెన్లకు 7.60 శాతం వడ్డీ అందుతుంది. ఇక 23 నెలల డిపాజిట్‌పై సాధారణ ప్రజలకు 7.25 శాతం, సీనియర్ సిటిజెన్లకు అత్యధికంగా 7.80 శాతం వడ్డీ వస్తుంది.మరోవైపు సీనియర్ సిటిజెన్లకు 3.25 శాతం నుంచి 7.75 శాతం వడ్డీ వస్తోంది. బ్యాంక్ తాజాగా 3 సంవత్సరాల నుంచి 4 సంవత్సరాల వ్యవధి డిపాజిట్లపై 50 బేసిస్ పాయింట్ల మేర వడ్డీ రేట్లను పెంచేసింది. దీంతో ఇది గతంలో 6.50 శాతంగా ఉండగా.. ఇప్పుడు 7 శాతానికి చేరింది. ఇక నాలుగేళ్ల టెన్యూర్ నుంచి ఐదేళ్ల లోపు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 75 బేసిస్ పాయింట్ల మేర వడ్డీ రేట్లను పెంచింది. దీంతో ఇది గతంలో 6.25 శాతంగా ఉండగా.. ఇప్పుడు 7 శాతానికి పెరిగింది. ఇప్పుడు ఏయే టెన్యూర్లపై వడ్డీ రేట్లు ఎలా ఉన్నాయనేది చూద్దాం. 7-14 రోజుల వ్యవధి డిపాజిట్లపై సాధారణ ప్రజలకు 2.75 శాతం, సీనియర్ సిటిజెన్లకు 3.25 శాతం వడ్డీ వస్తుంది. 15-30 రోజుల టెన్యూర్‌పై జనరల్ సిటిజెన్స్‌కు 3 శాతం, సీనియర్ సిటిజెన్లకు 3.50 శాతం వడ్డీ లభిస్తుంది. 31-45 రోజుల డిపాజిట్లపై వరుసగా 3.25 శాతం, 3.75 శాతం వడ్డీ వస్తుంది. అన్ని టెన్యూర్లపైనా సీనియర్ సిటిజెన్లకు సాధారణ ప్రజల కంటే 50 బేసిస్ పాయింట్ల మేర అదనంగా వడ్డీ వస్తుంది. 181-269 రోజుల టెన్యూర్ పై సాధారణ ప్రజలకు 6 శాతం, సీనియర్ సిటిజెన్లకు 6.50 శాతం మేర వడ్డీ లభిస్తుంది. 365 రోజుల నుంచి 389 రోజుల డిపాజిట్‌పై సాధారణ ప్రజలకు 7.10 శాతం, సీనియర్ సిటిజెన్లకు 7.60 శాతం వడ్డీ అందుతుంది. ఇక 23 నెలల డిపాజిట్‌పై సాధారణ ప్రజలకు 7.25 శాతం, సీనియర్ సిటిజెన్లకు అత్యధికంగా 7.80 శాతం వడ్డీ వస్తుంది.

రికరింగ్ డిపాజిట్ వడ్డీ రేట్లు..

కోటక్ మహీంద్రా బ్యాంక్ రికరింగ్ డిపాజిట్లపై 6 శాతం నుంచి 7.20 శాతం వరకు వడ్డీ ఆఫర్ చేస్తోంది. సీనియర్ సిటిజెన్లకు అయితే 6.50 శాతం నుంచి 7.70 శాతం వరకు ఇస్తోంది. ఇక ఇది 6 నెలల నుంచి 10 ఏళ్ల టెన్యూర్‌పై వర్తిస్తుంది. 15, 18, 21 వరుసగా సాధారణ ప్రజలకు అత్యధికంగా 7.20 శాతం, సీనియర్ సిటిజెన్లకు 7.70 శాతం వడ్డీ వస్తుంది.

# గుట్టలకొద్దీ నోట్ల కట్టలతో చిక్కిన ఎంపీ..

కాంగ్రెస్ పార్టీకి చెందిన రాజ్యసభ్య సభ్యుడు ధీరజ్ ప్రసాద్ సాహు ఫ్యామిలీ నిర్వహించే ఒడిశాకు చెందిన బౌద్ధ డిస్టిలరీ కంపెనీలో ఐటీ అధికారులు గతవారం మెరుపు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కంపెనీ కార్యాలయం ఆఫీసుల్లో కోట్లాది రూపాయల నగదు బయటపడింది. బీరుల్లోని బ్యాగుల్లో ఉన్న డబ్బును లెక్కించడానికి రోజుకు 50 మంది అధికారులు శ్రమిస్తున్నారు. ఇప్పటి వరకూ లెక్కించిన నగదును రూ.350 కోట్లుగా ఐటీ అధికారులు వెల్లడించారు. కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ ప్రసాద్ సాహు కుటుంబం నిర్వహిస్తున్న డిస్టిలరీ కంపెనీలో ఆదాయపు పన్ను అధికారులు గత గురువారం నిర్వహించిన సోదాల్లో నోట్ల కట్టలు గుట్టలు గుట్టలుగా బయటపడిన విషయం తెలిసిందే. గడచిన ఐదురోజులుగా 50 మంది బ్యాంకు అధికారులు 40 నగదు లెక్కింపు యంత్రాలతో ఆ నోట్ల కట్టలను లెక్కించారు. ఇప్పటివరకు రూ.353 కోట్ల లెక్క తేలిందని మీడియా కథనాలు వెల్లడించారు. అయితే, దేశంలో ఐటీ సోదాల్లో ఇంత పెద్ద మొత్తంలో నగదు పట్టుబడటం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. కాగా, గతంలో నల్లధనంపై ఎంపీ ధీరజ్ ప్రసాద్ సాహు చేసిన ట్వీట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. గతేడాది ఆగస్టు 12న ధీరజ్ అవినీతికి వ్యతిరేకంగా ట్వీట్ చేస్తూ.. 'పెద్ద నోట్ల రద్దు తర్వాత కూడా దేశంలో నల్లధనం, అవినీతిని చూస్తుంటే నా హృదయం ద్రవించుకుపోతోంది.. అంత పెద్ద మొత్తంలో నల్లధనం ఒకరి దగ్గర ఎలా పోగుపడుతుందో నాకర్థం కావడం లేదు. ఈ దేశంలో అవినీతిని పారదోలేది కాంగ్రెస్ మాత్రమే' అని పేర్కొన్నారు. ఆ పోస్టును ప్రస్తుతం బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయ రీట్వీట్ చేశారు. 'ధీరజ్ ప్రసాద్ సాహుకు మంచి హాస్య చతురత ఉంది' అని ఎద్దేవా చేశారు. ఒడిశాకు చెందిన బౌద్ధ డిస్టిలరీ కంపెనీ ఝార?ండ్, బెంగాల్‌లోనూ వ్యాపారాలు నిర్వహిస్తోంది. ఐటీ దాడుల్లో వందల కోట్ల నగదు బయటపడటంతో కాంగ్రెస్‌పై బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆధ్వర్యంలో పార్లమెంట్ వెలుపల బీజేపీ ఎంపీలు నిరసన చేపట్టారు. దీనిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వివరణ ఇవ్వాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. జేపీ నడ్డా మీడియాతో మాట్లాడుతూ.. 'కాంగ్రెస్, అవినీతి ఒకే నాణానికి ఉన్న బొమ్మ, బొరుసు లాంటివి. ధీరజ్ సాహు కంపెనీల్లో దొరికిన ఈ నల్లధనం ఎవరిది..? దీనిపై సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సమాధానం ఇవ్వాలి' అని నిలదీశారు. భారీ మొత్తంలో నగదు బయటపడటంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా విస్మయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష ఇండియా కూటమిపై అమిత్ షా విమర్శలు గుప్పించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఒక ఎంపీ ఇంటి నుంచి ఈ స్థాయిలో నగదు స్వాధీనం చేసుకోవడం ఇదే మొదటిసారని వ్యాఖ్యానించారు. అవినీతి అనేది కాంగ్రెస్ స్వభావం కాబట్టి ఆ పార్టీ నిశ్శబ్దంగా ఉందంటే సరేగానీ.. జేడీయూ, ఆర్జేడీ, డీఎంకే, ఎస్పీ ఎందుకు మౌనం వహిస్తున్నాయని ఆయన నిలదీశారు. కాగా, బయటపడిన నోట్ల కట్టల లెక్కింపు దాదాపుగా పూర్తికావొ చ్చిందని ఐటీ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ దూరంగా ఉంది.వ్యాపారాలతో తమకు ఎలాంటి సంబంధం లేదని, నగదు, దాని మూలాన్ని ఎంపీ వివరించాలని కోరింది.





# ఎప్పటివరకు అంటే?

జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దును సమర్థిస్తూ కీలక తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టు.. ఆ రాష్ట్ర ఎన్నికలకు సంబంధించి కీలక ఆదేశాలు జారీ చేసింది. జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా కల్పించి.. ఆ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘానికి సూచించింది.

ఆర్టికల్ 370 రద్దుకు సంబంధించి దాఖలైన అన్ని పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు నేడు కీలక తీర్పు వెలువరించింది. కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించడంతో జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా కల్పించేందుకు మార్గం సుగమమైంది. దీంతో ఆ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఉన్న అడ్డంకులు తొలిగిపోయాయి. ఈ క్రమంలోనే ఆర్టికల్ 370 రద్దుకు సంబంధించిన అంశాలపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. తీర్పు సందర్భంగా జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా కల్పించడం.. ఆ రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహించడంపైనా కీలక వ్యాఖ్యలు చేసింది. జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల గురించి కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. వచ్చే ఏడాది సెప్టెంబర్ 30 నాటికి జమ్మూ కాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు భారత ఎన్నికల సంఘం అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించింది. ఆర్టికల్ 370 రద్దుకు సంబంధించిన కేసులో తీర్పును చదివిన సీజేఐ డీవై చంద్రచూడ్.. జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర పునరుద్దరణకు చర్యలు తీసుకోవడంతో పాటు అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. వీలైనంత త్వరగా జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా కల్పించాలని పేర్కొన్నారు. అయితే జమ్మూ కాశ్మీర్ ఎప్పుడైనా ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పలుమార్లు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే తాజాగా సుప్రీంకోర్టు తీర్పు, ఎన్నికల నిర్వహణకు ఆదేశాలు జారీ చేయడంతో త్వరలోనే జమ్మూ కాశ్మీర్‌లో ఎన్నికలు జరిగి ప్రజా ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సులువు అయింది. జమ్మూ కాశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 370, ఆర్టికల్ 35 ఏ లను రద్దు చేస్తున్నట్లు 2019 ఆగస్టు 5 వ తేదీన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. ఆ సమయంలోనే త్వరలోనే జమ్మూ కాశ్మీర్‌కు మళ్లీ రాష్ట్ర హోదాను కల్పిస్తామని వెల్లడించారు. అక్కడ ఎన్నికల నిర్వహించిన తర్వాత ప్రజా ప్రభుత్వం ఏర్పడుతుందని స్పష్టం చేశారు. అయితే ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకించిన ఆ రాష్ట్రంలోని పలు పార్టీలు.. సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఈ క్రమంలోనే తాజాగా సర్వోన్నత న్యాయస్థానం కీలక తీర్పును వెలువరించింది.

# అసలు ఆర్టికల్ 370 ఏంటి.. దాన్ని ఎందుకు ప్రవేశపెట్టారు.. ఎందుకు రద్దు చేశారు?

ఆర్టికల్ 370 రద్దుకు సంబంధించిన అంశంపై తాజాగా సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. అది రాజ్యాంగ బద్ధమే అని తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలోనే అసలు ఈ ఆర్టికల్ 370 అంటే ఏంటి. దాన్ని ఎందుకు ప్రవేశపెట్టారు. ఆ తర్వాత దాన్ని ఎందుకు తొలగించారు. ఆర్టికల్ 370 అమలులో ఉన్నపుడు జమ్మూ కాశ్మీర్ ప్రాంతానికి ప్రత్యేక ప్రతిపత్తి ఉండేది. ఆర్టికల్ 370 రద్దు చేయకముందు దేశంలోని మిగితా రాష్ట్రాల కంటే జమ్మూ కాశ్మీర్‌కు కొన్ని ప్రత్యేకతలు ఉండేవి. అయితే భారత్‌లో అంతర్భాగమైన జమ్మూ కాశ్మీర్ కూడా దేశంలోని ఇతర రాష్ట్రాల మాదిరిగానే ఉండాలనే క్రమంలో కేంద్ర ప్రభుత్వం 2019 లో ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. అయితే ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో అనేక పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిని విచారణ జరిపిన కోర్టు.. తాజాగా ఆర్టికల్ 370 రద్దు రాజ్యాంగ బద్ధమేనని స్పష్టం చేస్తూ తీర్పు వెలువరించింది.

2019 ఆగస్టు 5న, భారత హోం మంత్రి అమిత్ షా జమ్మూ కాశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 370, ఆర్టికల్ 35ఏ లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇదే సమయంలో జమ్మూకాశ్మీర్ రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతాలుగా రెండు ప్రాంతాలుగా విభజించారు. అయితే, జమ్మూకాశ్మీర్ కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370, 35ఏ లను రద్దు చేసిన తర్వాత ప్రజలు, రాజకీయ వర్గాల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. ఈ రద్దును సమర్థించేవాళ్లు ఉన్నారూ.. వ్యతిరేకించే వాళ్లూ కూడా ఉన్నారు. ఇదే విషయం గురించి పలు రాజకీయ పార్టీలు, పలువురు ప్రజలు ఆర్టికల్ 370 రద్దును ఎత్తిచూపుతూ.. అనేక అంశాలు, ప్రశ్నలను లేవనెత్తుతూ న్యాయస్థానాలను ఆశ్రయించారు. అసలు ఈ ఆర్టికల్ 370 అంటే ఎమిటి? దానిని ఎందుకు తీసుకువచ్చారు? జమ్మూకాశ్మీర్, ఆర్టికల్ 370కి ఉన్న సంబంధమేంటి? రద్దు తర్వాత ఇంకా రచ్చ ఎందుకు కొనసాగుతోంది? అనే ఈ తరహా ప్రశ్నలు మీకు వచ్చే వుంటాయి.

ఆర్టికల్ 370 ని ఎప్పుడు ప్రవేశపెట్టారు

బ్రిటీష్ పాలన నుంచి 1947 లో భారత్ విముక్తి పొందిన తర్వాత దేశంలో చాలా చిన్న చిన్న రాజ్యాలు ఉండేవి. ఈ క్రమంలోనే వాటన్నింటినీ భారత యూనియన్‌లో కలిపేందుకు అప్పటి భారత ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలోనే జమ్మూ కాశ్మీర్‌ను కూడా భారత్ యూనియన్‌లో కలపడానికి ఆ సమయంలో జమ్మూ కాశ్మీర్‌ను పాలిస్తున్న రాజులు మహారాజా హరి సింగ్.. కొన్ని షరతులు విధించారు. ఇందులో భాగంగానే 3 అంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తూ ఇన్‌స్ట్రుమెంట్ ఆఫ్ యాక్సెషన్‌పై సంతకం చేశారు. అందులో మొదటిది విదేశీ వ్యవహారాలు రెండోది రక్షణ.. మూడోది కమ్యూనికేషన్స్. ఈ క్రమంలోనే 1948 మార్చిలో జమ్మూ కాశ్మీర్‌లో మహారాజా హరి సింగ్ తాత్కాలిక ప్రభుత్వాన్ని నియమించారు. ఆ సమయంల షేక్ అబ్దుల్లా ప్రధానమంత్రిగా ఉన్నారు. ఆ తర్వాత జూలై 1949 లో షేక్ అబ్దుల్లా తోపాటు మరో ముగ్గురు భారత రాజ్యాంగ సభలో చేరి జమ్మూ కాశ్మీర్ ప్రత్యేక హోదాపై చర్చలు జరిపారు. ఈ క్రమంలోనే జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే విధంగా పలు అంశాలతో షేక్ అబ్దుల్లా రూపొందించిన ఆర్టికల్ 370 ని ఆమోదించారు. ఆర్టికల్ 370 ప్రకారం రక్షణ, విదేశీ వ్యవహారాలు, ఫైనాన్స్ అండ్ కమ్యూనికేషన్ల విషయంలో మినహా జమ్మూ కాశ్మీర్‌లో దేశంలో అమలయ్యే చట్టాలను వర్తింపజేయడానికి పార్లమెంటుకు తప్పనిసరిగా జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వ ఆమోదం అవసరం అవుతుంది. అంటే భారత పార్లమెంటు ఆమోదించిన ఏ చట్టమైనా జమ్మూ కాశ్మీర్‌లో అమలు చేయాలన్నా స్థానిక ప్రభుత్వం నుంచి ఆమోదం అవసరం ఉంటుంది. వీటితోపాటు జమ్మూ కాశ్మీర్ ప్రజలకు కొన్ని రక్షణలు కల్పించారు. భారత రాజ్యాంగంతో పాటు జమ్మూ కాశ్మీర్‌కు మరో ప్రత్యేక రాజ్యాంగం కూడా ఉంటుంది. జమ్మూ కాశ్మీర్ పౌరుల పౌరసత్వం, ఆస్తి యాజమాన్యం, ప్రాథమిక హక్కుల చట్టం మిగిలిన భారత పౌరులతో పోల్చితే భిన్నంగా ఉంటుంది. ఈ ఆర్టికల్ 370 ప్రకారం ఇతర రాష్ట్రాలకు చెందినవారు జమ్మూ కాశ్మీర్‌లో ఆస్తిని కొనుగోలు చేయలేరు. ఇక జమ్మూ కాశ్మీర్‌లో ఆర్థిక అత్యవసర పరిస్థితిని ప్రకటించే అధికారం కూడా కేంద్రానికి ఉండదు.

ఆర్టికల్ 370తో వివాదాలు ఎందుకు?

భారత్ పాక్ విడిపోయిన తర్వాత కూడా జమ్మూ కాశ్మీర్‌ను సొంతం చేసుకోవాలని పాకిస్థాన్ అనేక ప్రయత్నాలు చేసినా అవి ఫలించలేదు. ఆర్టికల్ 370 అంగీకారం తర్వాత కొన్ని షరతులతో జమ్మూ కాశ్మీర్ భారత్‌లో విలీనం అయింది. ఆ తర్వాత నుంచి భారత్-పాక్‌ల మధ్య ఘర్షణ మరింత పెరిగింది. అయితే భారత్‌లో జమ్మూ కాశ్మీర్ అంతర్భాగం అయినా.. భారత చట్టాలు అక్కడ అమలు కాకపోవడంతో చాలా మంది దీన్ని వ్యతిరేకిస్తూ ఉన్నారు. దేశంలో ఉండే ప్రజలందరికీ ఒకే రకమైన హక్కులు, అధికారాలు ఉండాలనే వాదనలు తీవ్రంగా వినిపిస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 సహా ఇతర చట్టాలను రద్దు చేయాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. జమ్మూ కాశ్మీర్ అభివృద్ధికి ఆర్టికల్ 370 అడ్డుగా ఉందని మరికొందరు వాదిస్తున్నారు.

ఆర్టికల్ 370 రద్దు.. దాని తర్వాతి పరిణామాలు ఏమిటి?

2018 సార్వత్రిక ఎన్నికలకు ముందు తాము మళ్లీ అధికారంలోకి వస్తే జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేస్తామని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత జమ్మూ కాశ్మీర్ ప్రజల అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని పేర్కొంటూ 2019 ఆగస్టు 5 వ తేదీన ఆర్టికల్ 370 ని రద్దు చేస్తున్నట్లు సంచలన ప్రకటన చేసింది. జమ్మూ కాశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 370, ఆర్టికల్ 35 ఏలను రద్దు చేస్తున్నట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన తర్వాత స్థానిక ప్రజలు, పార్టీల నుంచి మాత్రమే కాకుండా దేశంలోని అనేక ప్రాంతాలు, రాజకీయ నాయకులు, మేధావుల నుంచి తీవ్ర భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. ఆర్టికల్ 370 ని రద్దు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని కొంతమంది స్వాగతించగా.. మరికొందరు తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో ఆర్టికల్ 370 రద్దును సవాలు చేస్తూ వివిధ అంశాలను ప్రస్తావిస్తూ ఎంతో మంది న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఈ అన్ని పిటిషన్లను కలిపి సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. ఆర్టికల్ 370 రద్దు అంశంపై సుప్రీంకోర్టులో మొత్తం 23 పిటిషన్లు దాఖలు కాగా.. వాటన్నింటినీ కలిపి సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం సుదీర్ఘ విచారణ జరిపి తాజాగా తీర్పును వెలువరించింది.

# రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మారాలి

- సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులతోనే ఆరోగ్యం పదిలం
- ప్రజలు సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించాలి
- రైతులు పంట వ్యర్థాలను కాల్చొద్దు: మంత్రి తుమ్మల



**హైదరాబాద్, మే 29 :** హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఆర్గానిక్ మేళా ప్రదర్శన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్‌ను సందర్శించి, రైతులతో ముచ్చటించారు. సేంద్రియ వ్యవసాయం ప్రాధాన్యత, సాగు విధానాలు, ఎదురవుతున్న సవాళ్లపై రైతులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో సేంద్రియ వ్యవసాయాన్ని మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులు ఆర్గానిక్ సాగు వైపు ముందుకు రావాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం మనం వినియోగిస్తున్న ఆహార పదార్థాలు రసాయనాల ప్రభావంతో కలుషితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక దిగుబడుల కోసం అవసరానికి మించి రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించడం వల్ల నేల సారవంతత దెబ్బతింటోందని తెలిపారు. అధికంగా రసాయన ఎరువులు వినియోగించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందించలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. రసాయనాలతో పండించిన పంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం వల్ల ప్రజల్లో అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని, క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులకు కూడా ఇది ఒక కారణంగా మారుతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం కార్పొరేట్ ఆసుపత్రులు వేగంగా విస్తరిస్తుండటానికి ప్రధాన కారణాల్లో ఆహారపు అలవాట్లు, రసాయనాల ప్రభావం కూడా ఒకటని ఆయన అభిప్రాయపడ్డారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా నేల ఆరోగ్యం, ప్రజల ఆరోగ్యం రెండూ మెరుగుపడతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులు ఉత్పత్తి చేస్తున్న ఆర్గానిక్ ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతుల నుంచి వినియోగదారులు నేరుగా ఉత్పత్తులను కొనుగోలు చేయాలని సూచించారు. ఎంత ఎక్కువగా ఆర్గానిక్ ఉత్పత్తులను కొనుగోలు చేస్తే, అంత ఎక్కువగా రైతులు సేంద్రియ సాగు వైపు ఆకర్షితులవుతారని, తద్వారా ఆరోగ్యకరమైన ఆహార వ్యవస్థ ఏర్పడుతుందని తెలిపారు. రైతులు, వినియోగదారులు, ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తేనే సమాజానికి ఆరోగ్యవంతమైన భవిష్యత్తును అందించగలమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. అలాగే రైతులు పంట వ్యర్థాలను పొలాల్లో కాల్చకుండా వాటిని సేంద్రియ ఎరువుల తయారీలో వినియోగించాలని సూచించారు. పంట అవశేషాల దహనం వల్ల పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు నేలలోని సూక్ష్మజీవులు నశిస్తాయని, ఇది భూమి సారంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని మంత్రి తెలిపారు. రైతులు పంట వ్యర్థాలను సద్వినియోగం చేసుకుంటూ సుస్థిర వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని పిలుపునిచ్చారు.

## ఎస్ఐఆర్‌పై నేతలంతా సంపూర్ణ అవగాహనతో ఉండాలి

**సీఎం రేవంత్‌రెడ్డి**



**హైదరాబాద్, మే 29 :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)తో తలెత్తే సమస్యలపై నేతలంతా సంపూర్ణ అవగాహనతో ఉండాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. గాంధీభవన్‌లో నిర్వహించిన టీపీసీసీ రాజకీయ వ్యవహారాల సమావేశంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. లంబాడీ, ఆదివాసీ, వలస కార్మికులకు ఎస్ఐఆర్ పెద్ద సమస్య కావొచ్చన్నారు. "ఎస్ఐఆర్‌తో దళితులు, మైనార్టీలు, మహిళల ఓట్లు పోయే అవకాశముంది. దీనివల్ల తలెత్తే సమస్యలపై నేతలకు పూర్తి అవగాహన ఉండాలి. ఎస్ఐఆర్ కోసం అన్ని నియోజకవర్గాల్లోనూ ఇన్‌ఛార్జ్‌లను నియమించాలి. వారు సరిగా పనిచేస్తే ఒక్క ఓటు కూడా తొలగించకుండా చూడొచ్చు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలను 10 రోజులకోసారి కలుస్తాను. నెలలో 3 రోజులు కార్యకర్తల కోసం సమయం కేటాయిస్తా. నాతో సహా అందరూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందే. బూత్ ఎన్‌రోలర్ల సాయంతో 90 రోజుల్లో 45 లక్షల డిజిటల్ సభ్యత్వాలు చేయించాం. ఎక్కువ సభ్యత్వాలు చేయించిన వారికి రాహుల్ గాంధీతో సన్మానం చేయించాం"అని రేవంత్ అన్నారు.

## 'క్యూర్' పరిధిలో అఫర్డబుల్ ప్లాట్ల నిర్మాణం

**హైదరాబాద్, మే 29 :** 'క్యూర్' పరిధిలో అఫర్డబుల్ ప్లాట్ల నిర్మాణానికి గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి.గౌతమ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్ఐజీ, ఎంఐజీ ప్లాట్లు నిర్మించేందుకు హౌసింగ్ బోర్డుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దిగువ, మధ్య తరగతి కోసం లక్ష ప్లాట్లు నిర్మించనుం దగా.. పైలట్ ప్రాజెక్టు కింద 12 వేల ప్లాట్ల నిర్మాణా నికి హౌసింగ్ బోర్డుకు అనుమతి ఇచ్చారు. ఎల్ఐజీ ప్లాట్లకు భూమి యూడీఎస్, రూ.5 లక్షల సబ్సిడీ ఇవ్వనున్నారు. హౌసింగ్ బోర్డు, దిల్, రాజీవ్ స్వగృహ, ప్రభుత్వ భూముల్లో ప్లాట్ల నిర్మాణం చేపట్టనున్నారు.

## ఔట్ సోర్సింగ్ నియామకాల్లో అక్రమాలు

**ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఫిర్యాదు**

**హైదరాబాద్, మే 29 :** మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఇటీవల చేపట్టిన ఔట్‌సోర్సింగ్ నియామకాల్లో భారీ అవినీతి, అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టా రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడుతూ.. యూనివర్సిటీలో నిర్వహించిన ఔట్‌సోర్సింగ్ నియామకాలు పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని తెలిపారు. రోస్టర్ రిజర్వేషన్ విధానం పాటించకుండా పత్రిక ప్రకటనలు సరైన విధంగా ఇవ్వకుండా అర్హులైన నిరుద్యోగులకు అవకాశం లేకుండా నియామకాలు చేపట్టారని ఆరోపించారు. ఇప్పటికే ఈ అంశంపై యూనివర్సిటీ వీసీ,రిజిస్ట్రార్‌కు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా అధికారులు స్పందించకపోవడంతో ఉన్నత విద్యా మండలి చైర్మన్‌ను కలిసి పూర్తి వివరాలు తెలియజేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థి సంఘ నాయకుడు వాడపల్లి నవీన్ మాట్లాడుతూ.. గతంలో నవీన్ మిట్టల్ వైస్ ఛాన్సలర్‌గా ఉన్న సమయంలో కూడా 33 మంది డైలీ వేజ్ ఉద్యోగులను రోస్టర్ రిజర్వేషన్, పత్రిక ప్రకటనలు లేకుండా అక్రమంగా నియమించారని తెలిపారు. ప్రస్తుతం చేపట్టిన నియామకాలలో కూడా నిరుద్యోగుల వద్ద లక్షల రూపాయలు వసూలు చేసి 100కు పైగా అక్రమ నియామకాలు జరిగాయని ఆరోపించారు. అక్రమాలకు పాల్పడిన ఏజెన్సీపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఆ ఏజెన్సీకి యూనివర్సిటీ లేదా ఇతర ప్రభుత్వ సంస్థల్లో పనులు ఇవ్వకుండా బ్లాక్‌లిస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.అలాగే ప్రస్తుతం జరిగిన నియామకాలను పూర్తిగా రద్దు చేసి, తిరిగి పారదర్శకంగా నోటిఫికేషన్ విడుదల చేసి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించి నాణ్యత కలిగిన విద్యావంతులను ఎంపిక చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు పోలగొని శివ, రాజేష్, యశ్వంత్, రామ్, జితేందర్, సంజీవ, నిరుద్యోగ యువకులు పాల్గొన్నారు.

## ఫేక్ జీవోలతో భూ ఒప్పందాలు

- నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ భూమికి ఎసరు
- నకిలీ ముఠాను అరెస్ట్ చేసిన పోలీసులు

**మేడ్చల్, మే 29 :** ఫేక్ జీఓలు, అక్రమ భూ ఒప్పందాల ద్వారా భారీ మోసానికి పాల్పడిన ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. నార్సింగి పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో నిమ్మల రాజేష్ గౌడ్, నిమ్మల వేణుగోపాల్, నిమ్మల సాయికిరణ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. మరోవైపు వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సహా మరికొందరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. గండిపేట సర్వే నెంబర్ 18లోని ప్రభుత్వ భూమిపై నకిలీ పత్రాలు సృష్టించి, ఆ భూమిని తమదిగా చూపిస్తూ ఫేక్ జీఓలు తయారు చేసినట్లు దర్యాప్తులో తేలింది. వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా ఈ నకిలీ జీఓలను వైరల్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రభుత్వం భూమిని క్రమబద్ధీకరించినట్లు చెబుతూ ఐదు ఫేక్ జీఓలను సృష్టించిన నిందితులు, ఆ భూమిని ఎకరాకు రూ.3.5 కోట్లకు అమ్మేందుకు కుట్ర చేసినట్లు సమాచారం. ఈ భూమి డీల్‌లో బొల్లా రమేష్, బ్రహ్మనాయుడుతో ఒప్పందం కుదిరినట్లు దర్యాప్తులో బయటపడింది. బొల్లా బ్రహ్మనాయుడుకు నిమ్మల కుటుంబం నుండి రెండు విడతలుగా డబ్బు ట్రాన్స్‌ఫర్ అయినట్లు పోలీసులు తెలిపారు. ఒకసారి కోటి రూపాయలు, మరోసారి 25 లక్షలు ట్రాన్స్‌ఫర్ అయినట్లు గుర్తించారు. మొత్తం భూ లావాదేవీల్లో సుమారు నాలుగు కోట్లు చేతులు మారినట్లు దర్యాప్తులో తేలింది. కోర్టు ఆదేశాలతో నిందితుల ఇళ్లలో సోదాలు నిర్వహించి, బ్యాంక్ పాస్‌బుక్స్, మొబైళ్లు, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ తెలిపారు. చట్టబద్ధ హక్కులు లేకపోయినా ప్రభుత్వ పోరంబోకు భూమిపై హక్కులు ఉన్నట్లు చూపించే ప్రయత్నం చేసినట్లు వెల్లడించారు. హైకోర్టులో తమ భూమే అని నిందితులు పిటిషన్లు దాఖలు చేసినప్పటికీ, అక్టోబర్ 2025లో వాటిని కోర్టు కొట్టివేసినట్లు తెలిపారు. అనంతరం కూడా అక్రమంగా భూమి అమ్మకానికి ప్రయత్నించినట్లు పోలీసులు చెప్పారు. ఫేక్ జీఓలు, ఫోర్జరీ పత్రాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు. భూమి కొనుగోలు చేసే ముందు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ రికార్డులను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు.

## రైతులను వంచిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్**

**నల్లగొండ, మే 29 :** దేశంలోనే కేంద్ర పూల్ కు అత్యధికంగా ధాన్యాన్ని అందించిన రాష్ట్రంగా తెలంగాణను నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ నంబర్ వన్ స్థానంలో నిలబెడితే.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా వంచిందని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. శుక్రవారం కోదాడలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. నేడు రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద నెలల తరబడి టోకెన్ల కోసం పడిగాపులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ప్రతి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ఊదరగొట్టి తీరా అధికారంలోకి వచ్చాక సన్న వడ్లకే ఇస్తామని కొర్రీలు పెట్టి రైతన్నను పచ్చిగా మోసం చేయడంలో కాంగ్రెస్ నంబర్ వన్ స్థానంలో నిలబడిందని ఎద్దేవా చేశారు. పక్క రాష్ట్రం కంటే రెండు బస్తాలు ఎక్కువగా ధాన్యాన్ని కొనుగోలు చేశామని మంత్రి ఉత్తమ్‌కుమార్ చెప్పడం విడ్డూరంగా ఉందని, క్లాసులో అందరికంటే చివరగా వచ్చిన వాడితో తనని తాను పోల్చుకోవడం లాంటిదని, కాగితాల్లోనే ఆయన నంబర్ వన్ అని పేర్కొన్నారు. అకాల వర్షానికి ధాన్యం తడిసి రైతులు దైన్యంగా చూస్తున్న పరిస్థితుల్లో కొనుగోలు చేయలేని దగా ప్రభుత్వం ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అని విమర్శించారు..తరుగు పేరుతో రైతులను నిలువెల్లా దోచుకుంటున్నారని, జూన్ 1 లోగా కొనుగోలు ముగించాలని డెడ్‌లైన్ పెట్టడం దేనికి సంకేతం అని, అప్పటికి బోర్డు తిప్పేసి మిగిలిన ధాన్యాన్ని దళారులకు, మిల్లర్లకు తక్కువ ధరకు అమ్ముకునేలా చేయాలనుకోవడం రైతులను మోసం చేసినట్లు కాదా అని ఆయన ప్రశ్నించారు. కోదాడ నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకులు మట్టి, ఇసుక, భూ కబ్జాలకు పాల్పడుతుంటే మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి వారికి వెన్నుదన్నుగా ఉన్నారని విమర్శించారు. రాష్ట్రం ఆవిర్భవించక ముందు ధాన్యం ఉత్పత్తిలో రాష్ట్రం 14వ స్థానంలో ఉంటే ఉద్యమ నేత కేసీఆర్ పకడ్బందీ ప్రణాళికతో దేశంలో అగ్రస్థానానికి చేర్చారని కొనియాడారు. కొవిడ్ లాంటి సంక్షేమ సమయంలో కూడా రికార్డ్ స్థాయిలో ధాన్య సేకరణ జరిగిందన్నారు. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ధాన్యం కొనుగోలు ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లోకి రూ.26 వేల కోట్లు జమైన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రైతులు తమ ధాన్యాన్ని దళారుల పాలు చేయకుండా నేరుగా తమ గ్రామాల పరిధిలోనే అమ్ముకునేలా ఐకెపిల ద్వారా 7 వేలకు పైగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌కు దక్కిందన్నారు. ధాన్యం నిల్వకు వందల కోట్లతో గోదాములు నిర్మించారన్నారు. రెండున్నర సంవత్సరాల దగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

## తెలంగాణ ఈసెట్ ఫలితాలు విడుదల

**వెబ్‌సైట్‌లో అందుబాటులోకి ఫలితాలు**

**హైదరాబాద్, మే 29 :** తెలంగాణ ఈసెట్ ఫలితాలు విడుదల అయ్యాయి. మాసాబ్ ట్యాంక్ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో శుక్రవారం ఉన్నత విద్యా మండలి చైర్మన్, ప్రొఫెసర్ బాలక్రిష్ణ రెడ్డి ఫలితాలను విడుదల చేశారు. ఈసెట్‌లో మొత్తం 16,726 మంది అభ్యర్థులు (93.60 శాతం) క్వాలిఫై అయ్యారు. ఈ సందర్భంగా బాలక్రిష్ణ రెడ్డి మాట్లాడుతూ.. త్వరలోనే కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదల చేస్తామని చెప్పారు. జూలై మొదటి వారంలో క్లాసెస్ ప్రారంభం అవుతాయని తెలిపారు. ఫీజులు గత ఏడాది మాదిరిగానే ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొ. కుమార్ మొలుగారం, ఈసెట్ కన్వీనర్ ప్రొ.చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు. దీంతో రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ ప్రవేశాలకు ఎదురుచూస్తున్న విద్యార్థుల నిరీక్షణకు తెరపడింది. మే 15న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్ష ఫలితాలు, విద్యార్థుల మార్కుల వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. డిప్లొమా(పాలిటెక్నిక్), బీఎస్సీ(మ్యాథమెటిక్స్) పూర్తిచేసిన విద్యార్థులకు నేరుగా బీటెక్, బీఫార్మసీ కోర్సుల ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలు కల్పించేందుకు ఈ పరీక్షను ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. ఫలితాల విడుదల నేపథ్యంలో ఇంజినీరింగ్ కాలేజీల్లో చేరాలనుకునే విద్యార్థుల్లో సందడి నెలకొంది. పరీక్షకు హాజరైన అభ్యర్థులు తమ ఫలితాలను, ర్యాంక్ కార్డులను అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు తమ హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీ, రిజిస్ట్రేషన్ నంబర్‌ను నమోదు చేసి స్క్రీన్‌పై ఫైనల్ ర్యాంక్‌ను చూసుకోవచ్చని ఉన్నత విద్యా మండలి అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే కొద్ది రోజుల్లోనే కేటగిరీల వారీగా కౌన్సెలింగ్ తేదీలు, సర్టిఫికేట్ వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్ల నమోదుకు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ప్రకటించనుంది. అడ్మిషన్ల ప్రక్రియ ముగిసే వరకు విద్యార్థులు తమ ర్యాంక్ కార్డులను, హాల్ టికెట్లను జాగ్రత్తగా ఉంచుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. కౌన్సెలింగ్‌కు సంబంధించి అప్‌డేట్ల కోసం విద్యార్థులు నిరంతరం అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించాల్సిందిగా కోరారు.



## కాసర్ల పద్మకు కేటీఆర్ నివాళి

**పార్థివ దేహం వద్ద పుష్పాంజలి**

**రాజన్నసిరిసిల్ల, మే :** సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 27వ వార్డు కౌన్సిలర్ కాసర్ల పద్మ పార్థివదేహానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పించారు. గుండెపోటుతో కాసర్ల పద్మ మరణించారనే వార్త తెలియగానే హుటాహుటిన హైదరాబాద్ నుంచి బయల్దేరి ఆయన సిరిసిల్లకు వచ్చారు. అనంతరం కాసర్ల పద్మ నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కాసర్ల పద్మకు ఘనంగా నివాళులర్పించారు. కాసర్ల పద్మ 2020లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అప్పటి మున్సిపల్ ఎన్నికల్లో 27వ కౌన్సిలర్‌గా పోటీ చేసినప్పటికీ ఆమె ఓడిపోయారు. మొన్నటి ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. పది రోజుల కిందట కాసర్ల పద్మ అనారోగ్యానికి గురయ్యారు. దీంతో కుటుంబసభ్యులు ఆమెను కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతున్న సమయంలో గుండెపోటు రావడంతో ఆమె మరణించారు. పద్మ మృతి పట్ల బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ చైర్మన్ జిందం కళా చక్రపాణి, వైస్ చైర్మన్ దార్ల సందీప్, పాలకవర్గం, పార్టీ నాయకులు సంతాపం తెలిపారు. కాగా, ఆమెకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

## పెద్దాపురంలో భారీ ఆన్‌లైన్ మోసం

**పెట్టుబడుల పేరుతో దంపతుల నుంచి 85 లక్షలు స్వాహా**

**కాకినాడ,మే29 :** పెద్దాపురంలో భారీ ఆన్‌లైన్ మోసం వెలుగులోకి వచ్చింది. స్టాక్ మార్కెట్ పెట్టుబడుల పేరుతో సైబర్ కేటుగాడు ఒక దంపతుల నుంచి రూ. 85 లక్షలు స్వాహా చేసిన ఘటన కలకలం రేపింది. పెద్దాపురం వర్జుల వారి వీధికి చెందిన సురే వేణు దంపతులను సైబర్ కేటుగాడు లక్షల్లో మోసం చేశాడు. తాను ఆనంద్ రాఠీ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్స్ లిమిటెడ్ మేనేజర్ అని నమ్మబలికి, 3 నెలల్లో 300 శాతం లాభాలు ఇస్తామని వాట్సాప్ సందేశాలతో వల వేసాడు. ఆ కేటుగాడి మాటలు నమ్మిన వేణు, ఆయన భార్య మహాలక్ష్మి వాట్సాప్ గ్రూప్‌లో చేరారు. యూజర్ ఐడి 4673 ద్వారా విడతల వారీగా మొత్తం రూ. 85 లక్షలు డిపాజిట్ చేశారు. ర్వాత డబ్బు విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా అకౌంట్ బ్లాక్ అయినట్లు బాధితులు తెలిపారు. అనంతరం నిందితుడు స్పందించకపోవడంతో అనుమానం కలిగిందన్నారు. తాము మోసపోయామని గ్రహించిన సురే వేణు.. పెద్దాపురం పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## తెలంగాణ బిడ్డలను ముట్టుకుంటే ఖబర్దార్

- ప్రొఫెసర్ నాగేశ్వర రావును అరెస్ట్ చేస్తే తీవ్ర పరిణామాలు
- మళ్లీ గో బ్యాక్ ఆంధ్ర ఉద్యమం చేపడతాం
- జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హెచ్చరిక

**హైదరాబాద్, మే 29 :** తెలంగాణ బిడ్డలను ముట్టుకోవాలని ఆంధ్ర నుండి ఎవరైనా ప్రయత్నిస్తే, ఇక్కడ తీవ్ర పరిణామాలు ఉంటాయని, 'గో బ్యాక్ ఆంధ్ర' ఉద్యమం మళ్లీ మొదలవుతుందని జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హెచ్చరించారు. ప్రముఖ విశ్లేషకులు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ రావును విమర్శించే స్థాయి, అర్హత పవన్ కళ్యాణ్‌కు లేవని అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. దమ్ముంటే తెలంగాణకు వచ్చి ప్రొఫెసర్ నాగేశ్వర్ రావును అరెస్ట్ చేయండి, అప్పుడు ఆయన ఇంటి ముందు అడ్డుగా నేను నిలబడతాను అంటూ పవన్ కళ్యాణ్‌కు సవాల్ విసిరారు. ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు . పవన్ కళ్యాణ్‌ను ఒక ప్యాకేజ్ స్టార్ గా అభివర్ణించిన ఆయన, భవిష్యత్తులో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గనుక ఎక్కువ ప్యాకేజ్ ఇస్తే ఆయనకు కూడా సపోర్ట్ చేయడానికి పవన్ వెనకాడరని ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయ నాయకుల తీరుపై మండిపడుతూ.. 'మీరంతా ఉండేది, ఆస్తులు సంపాదించుకునేది హైదరాబాద్‌లోనే కదా, మరి అన్ని వేల కోట్లు పెట్టి అమరావతిని ఎందుకు కట్టుకుంటున్నారు?' అని అనిరుధ్ రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలను తక్కువ చేసి మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని, రాజకీయాల కోసం ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టడం సరికాదని హితవు పలికాడు.

# గురుకులాల్లో సీట్ల భర్తీకి భారీ స్పందన

- ఫేజ్-1లోనే 18,401 సీట్లు భర్తీ
- అణగారిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య
- సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యం
- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**హైదరాబాద్, మే 29 :** తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి సైనిక పాఠశాలలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, నాన్-సీఓఈ మరియు ఒకేషనల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను శుక్రవారం డా.బి . అర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విడుదల చేశారు. సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యను సామాజిక మార్పుకు ప్రధాన సాధనంగా భావిస్తూ పేద, దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యను పూర్తిగా ఉచితంగా అందించేందుకు కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. గురుకుల విద్యాసంస్థలను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చారిత్రాత్మక చర్యలు తీసుకుంటోందన్నారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ 5న ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల చేయగా, ఏప్రిల్ 6 నుంచి మే 25 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 45,357 దరఖాస్తులు అందగా, అందులో ఓఖఅ గ్రూప్‌కు 21,447, ఃతిఖఅ గ్రూప్‌కు 17,400, ఓఇఅ, అఇఅ, ఊఇఅ గ్రూపులకు కలిపి 6,510 దరఖాస్తులు వచ్చినట్లు మంత్రి అడ్లూరి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకుల విద్యాసంస్థల్లో మొత్తం 19,740 సీట్లు అందుబాటులో ఉండగా, మే 15న 117 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 39,052 మంది విద్యార్థులు హాజరై 86.09 శాతం హాజరు నమోదైనట్లు వెల్లడించారు. ఫేజ్-1 అడ్మిషన్లలోనే మొత్తం 18,401 సీట్లు భర్తీ కావడం గురుకులాలపై పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. ఇంకా 1,339 సీట్లు మాత్రమే మిగిలి ఉన్నాయని తెలిపారు.

# కాలంతో పోరాడలేక చతికిల పడ్డ కమ్యూనిస్టులు



**కేరళ సిఎంగా ఉండగానే పినరయ్ విజయ్‌పై ఆరోపణలు వచ్చాయి. కూతురికి లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేశారన్న అభియోగాలు వచ్చాయి. ఇందులో ఆనాటి నుంచే కేసు నడుస్తోంది. తాజాగా ఇప్పుడు ఇడి రంగంలోకి దిగడంతో ఇది కాంగ్రెస్, బిజెపిల కుట్ర అని, లెఫ్ట్ పార్టీని దెబ్బతీసే కుయుక్తి అంటూ విమర్శలు చేస్తున్నారు. చాలా విచిత్రంగా ఈ రెండు పార్టీలు కలుస్తాయా అన్నది కమ్యూనిస్టులే చెప్పాలి. మరో విషయమేమంటే ఎన్నికల సందర్భంగా రాహుల్ తన ప్రచారంలో బిజెపి లెఫ్ట్‌తో కుమ్మక్కయిందని ఆరోపించారు. కాంగ్రెస్- బిజెపి రెండూ కూడబలుక్కొని కేరళంలో సిపిఎం ప్రతిష్టను దెబ్బతీయటానికి బరి తెగించాయని విమర్శలు చేస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇడి నోటీసులు ఇవ్వటంతో వ్యవహారం మొదలైంది. దేశంలో ప్రతిపక్ష పార్టీలపైనా, నాయకులపైనా అవినీతి ఆరోపణలు గుప్పించడం, ఆ తరువాత తన గుప్పిట్లో పెట్టుకున్న దర్యాప్తు సంస్థల చేత దాడులు చేయించడం కేంద్రంలోని మోడీ-షా ప్రభుత్వం చాలాకాలంగా అనుసరిస్తున్న విధానం అని దాదాపు అన్ని పార్టీలు చేస్తున్న ఆరోపణలే. ఢిల్లీలో అరవింద్ కేజీవ్రాల్, జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్‌ల మీద సాగించిన దాష్టీకం, ఇందులో భాగమని సిపిఎం ఆరోపణ.**

అవినీతి పంకిలం అంటించి రాజకీయ లబ్ధి పొందాలనే బిజెపి కుట్రపూరిత వ్యూహం అత్యంత దిగజారుడుతనానికి నిదర్శనంగా ఇప్పుడు సిపిఎం ఆరోపిస్తోంది. కేరళంలో అధికారం కోల్పోయాక సిపిఎం బహుశా కనుమరుగైనట్లుగానే భావించాలి. కేరళంలో కొంత మిణుకుమిణుకుమంటున్నా,దేశంలోని అనేక రాష్ట్రాల్లో అసలు ఉనికి లేకుండా పోయింది. ముఖ్యంగా కమ్యూనిస్టులు నేలవిడిచి సాము చేయడం, పడికట్టు సిద్ధాంతాల నుంచి బయటపడక పోవడం, గతంలో లాగా పోరాటలకు దూరంగా ఉండడం వంటివన్నీ వారిని తుడిచిపెట్టేలా చేశాయి. కేరళంలో విజయన్ కుమార్తె నిర్వహణలోని సంస్థ అందించిన సేవల నిమిత్తం పొందిన ప్రతిఫలాన్ని వివాదాస్పదం చేసి, మనీ లాండరింగ్ సెక్షన్లు బనాయించిందన్నది సిపిఎం ఆరోపణగా ఉంది. రాహుల్ గాంధీ ఇంకో రెండడుగులు ముందుకేసి, పినరయి విజయన్‌ను ఎందుకు అరెస్టు చేయరంటూ ప్రశ్నించాడట. కేరళంలో అధికారంలోకి వచ్చిన మరు క్షణం నుంచి ఒకపక్క కాంగ్రెస్, మరోపక్క సంఘ్ పరివార్ శక్తులూ సిపిఎంపై దాడులకు తెగబడుతున్నాయన్న వాదనను సిపిఎం తెరపైకి తెచ్చింది. విజయన్ ఇంటిపై కుట్రపూరిత దాడుల గురించి తెలిసిన వెంటనే దేశమంతా వెల్లువెత్తిన నిరసనలే ఎర్రజెండా పట్ల ప్రజల నమ్మకానికి నిదర్శనం అంటోంది. నిజానికి ఈ కేసు చాలా చిన్నది. దీనిని కోర్టులో తేల్చుకోవచ్చు. కానీ అలా చేయడం లేదు. లెఫ్ట్ రాజకీయాలకు వస్తే బెంగాల్లో 35 ఏళ్లపాటు అధికారంలో ఉండి చేసిందేమీ లేదు. కేరళలోనూ ప ఎద్దగా అభివృద్ధి జరిగిన దాఖలాలు లేవు. తరిపురలోనూ అలాగే చేశారు. అందుకే ప్రజలు వీరిని ఇంటికి పంపించారు. ఈ దెబ్బతో దేశంలో ఇక లెఫ్ట్ పార్టీలకు కాలం చెల్లినట్లే.

అభివృద్ధి చెందిన దేశాల్లో, అంటే సంపన్న, వలసవాద, పారిశ్రామిక దేశాల్లో కమ్యూనిస్టు భావజాలం అంతగా విస్తరించలేకపోయింది. వలస విముక్తి ఉద్యమాలు జోరందుకున్న లేదా నవస్వతంత్ర దేశా ల్లో మాత్రం దండిగా మార్మోగింది. అలాంటి దేశాల్లో భారత్ మొదటి వరుసలో ఉంటుంది. సాంప్రదాయిక భావజాల ప్రతినిధి అయిన ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించిన 1925లోనే కమ్యూనిస్టు పార్టీ ఊపిరిపోసుకుంది. ఆర్ఎస్ఎస్ కుటుంబానికి చెందిన బీజేపీ తన అధికారాన్ని పటిష్టపరచుకుంటున్న తరుణంలో కమ్యూనిస్టులు కనుమరుగైపోతుండటం ఓ వైచిత్రి. రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత 1951 -52 నాటి తొలి ఎన్నికల్లో వారు గణనీయమైన విజయాలు సాధించారు. నల్గొండ నుంచి కమ్యూనిస్టు నేత రావి నారాయణరెడ్డి, తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను మించిన మెజారిటీ సాధించడం గురించి అప్పట్లో గొప్ప గా చెప్పుకొన్నారు. తాజాగా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత దేశంలో కమ్యూనిస్టుల పలుకుబడి అడుగంటిన సూచనలు కనిపిస్తు న్నాయి. సు మారు 50 ఏండ్లలో ఏ రాష్ట్రంలోనూ కమ్యూనిస్టు ప్రభుత్వం లేని పరిస్థితి వచ్చింది. కేరళలో పినరయి విజయన్ ప్రభుత్వ ఓటమి కీలక పరిణామమే. దీంతో దేశ రాజకీయాల్లో కమ్యూనిస్టుల శకం అంతరించినట్టేననే వ్యాఖ్యానాలు వినిపిస్తుండటం గమనార్హం. ఒకప్పుడు కమ్యూనిస్టులు ప్రజల కోసం ఉద్యమాలు చేసేవారు. ఇప్పుడా పరిస్థితులు లేకుండ పోయాయి. కేరళ తర్వాత బెంగాల్, త్రిపుర ఇలా మొత్తం మూడు రాష్ట్రాల్లో వామపక్ష ప్రభుత్వాలు సుదీర్ఘకాలం కొనసాగాయి. కానీ ఇప్పుడదంతా గత వైభ వం. మారిన పరిస్థితుల్లో దానిని తిరిగి రాబట్టుకోవడం అంత సులభం కాదని మాత్రం చెప్పవచ్చు. కేంద్రంలో కాంగ్రెస్ ఆధిపత్యం వీగిపోయి, సంకీర్ణ ప్రభుత్వాల కాలంలో కమ్యూనిస్టులు హస్తినలో మంత్రి పదవులూ చేపట్టారు.

ఓ దశలో కమ్యూనిస్టు సీనియర్ నేత జ్యోతిబసును ప్రధాని పదవి చేపట్టే అవకాశమూ తలుపు తట్టింది. అంతటి ఉన్నతస్థితి నుంచి, నేడు ఏమాత్రం ప్రాముఖ్యం లేని స్థాయికి కమ్యూనిస్టులు పడిపోయారు. కేరళంలో తమను ఓడించిన కాంగ్రెస్‌తో తెలంగాణలో అంటకాగడం, ఒకటి రెండు స్థానాల కోసం వెంపర్లాడటం వారి దైన్యాన్ని కండ్లకు కడుతున్నది. భారత్‌లో పార్లమెంటరీ పంథాలో వెళ్లిన కమ్యూనిస్టులు కనుమరుగవుతుంటే, మరోవైపు సాయుధ పోరాటాన్ని ఎంచుకున్న కమ్యూనిస్టులు కగార్ ధాటికి నేలకొరుగుతున్నారు. కమ్యూనిస్టుల 'చారిత్రిక తప్పిదాలు', ప్రజల్లో పెరిగిన వినిమయతత్వం అందుకు దారితీశాయి అనేది అక్షరసత్యం. ప్రజలిప్పుడు డబ్బు సంపాదించటం, ఖర్చు పెట్టటం గురించి తప్ప విప్లవాలు, ఉద్యమాల గురించి ఎక్కువగా ఆలోచించటం లేదు. కాలం చెల్లిన వ్యూహాలు, ఎత్తుగడలూ కమ్యూనిస్టుల మహాప్రస్థానానికి బ్రేకులు వేశాయి. మొత్తంగా ఇప్పుడు కమ్యూనిస్టుల భవిష్యత్ ఏంటన్నది కాలమే చెప్పాలి. పినరయ్ విజయ్ లాంటి వారు కూతురుకు మేలు చేయడం కోసం అవినీతి బురద తొక్కడం కూడా కాల వైచిత్రమే.

## సిద్ధరామయ్య రాజీనామా
# ఆమోదించిన గవర్నర్



**కర్ణాటక :** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాజీనామాకు గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ ఆమోదం తెలిపారు. సీఎం పదవికి సిద్ధరామయ్య నిన్న రాజీనామా చేసిన విషయం తెలిసిందే. గవర్నర్ మధ్యప్రదేశ్‌లో ఉండటంతో లోక్‌భవన్‌కు వెళ్లిన సిద్ధరామయ్య.. గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి ప్రభుశంకర్‌కు రాజీనామాపత్రం సమర్పించారు. అర్ధరాత్రి మధ్యప్రదేశ్ నుంచి తిరిగి బెంగళూరు చేరుకున్న గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ శుక్రవారం ఉదయం సిద్ధరామయ్య రాజీనామాను ఆమోదించారు. తదుపరి సీఎం ఎంపిక వరకు ఆపద్ధర్మ సీఎంగా ఆయనే కొనసాగనున్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన సిద్ధరామయ్య పలువురు సీనియర్ నేతలతో కలిసి గురువారం సాయంత్రం దిల్లీ వెళ్లారు. దిల్లీ పర్యటనలో భాగంగా కాంగ్రెస్ అగ్రనాయకులతో భేటీ కానున్నారు. కర్ణాటకలో తదుపరి ముఖ్యమంత్రి ఎంపిక, మంత్రివర్గ కూర్పుపై చర్చించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

# 'నైరుతి' రాక మరింత ఆలస్యం



**న్యూఢిల్లీ :** మండుటెండలతో అల్లాడిపోతున్న ప్రజలకు ఇప్పుడప్పుడే ఉపశమనం లభించేలా కన్పించట్లేదు. నైరుతి రుతుపవనాల రాక మరింత ఆలస్యమవుతోంది. జూన్ 4, 5 తేదీల్లో ఈ రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. వాస్తవానికి మే 26వ తేదీనే నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని తొలుత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. కానీ, ఈ సారి ఎల్‌నినో ప్రభావంతో ఆ అంచనాలు తలకిందుల య్యాయి. రుతుపవనాలు నెమ్మదిగా కదులుతుండటంతో వీటి రాక ఆలస్యమవుతోంది. కేరళను తాకిన రెండు, మూడు రోజుల తర్వాత అవి తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉంది. గతేడాది, అంచనా వేసిన సమయాని కంటే ఎనిమిది రోజులు ముందుగానే మే 24న ఈ రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకాయి. ఆ తర్వాత మే 26న తెలంగాణలోకి ప్రవేశించాయి. ఇదిలా ఉండగా.. ఈ ఏడాది సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ ఇప్పటికే ప్రకటించింది. ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వర్షాలు తక్కువ పడొచ్చని పేర్కొంది. ఇక, జూన్‌లోనూ యూపీ, హరియాణా, పంజాబ్, బిహార్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, గుజరాత్, ఛత్తీస్‌గఢ్‌లోని పలు ప్రాంతాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది.

# కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్

- 200 ఇంటర్ సిటీ రైళ్ల తయారీకి రంగం సిద్ధం
- ప్రధాని మోడీ, మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కిషన్ రెడ్డి కృతజ్ఞతలు



**హైదరాబాద్, మే 29 :** కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు 200 ఇంటర్‌సిటీ రైళ్ల తయారీ బాధ్యతను ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అప్పగించడంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నిరంతర సహకారం అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా స్పందించారు. రాబోయే ఐదేళ్లలో 200 ఇంటర్‌సిటీ రైళ్లను తయారు చేయాలని రైల్వే శాఖ నిర్ణయించిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. దీనిపై సమీక్ష నిర్వహించి, ఆ బాధ్యతను కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు అప్పగిస్తూ రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ నిర్ణయం తీసుకోవడం హర్షనీయమన్నారు. ఈ ఇంటర్‌సిటీ రైళ్లు 20 కోచ్‌ల కాన్ఫిగరేషన్‌తో, ఆటోమేటిక్ డోర్ క్లోజింగ్, మెరుగైన వెంటిలేషన్, సురక్షితమైన కోచ్ డిజైన్ వంటి ఆధునిక సదుపాయాలను కలిగి ఉంటాయని ఆయన పేర్కొన్నారు. వీటిని సాధారణంగా సుమారు 300 కిలోమీటర్ల దూరం ఉన్న మార్గాల్లో నడిపిస్తారని తెలిపారు. అలాగే ప్రతి ట్రిప్‌లో చాలా స్టాప్‌లు ఉంటాయని కేంద్ర మంత్రి చెప్పారు. ఇంటర్‌సిటీ రైళ్లు గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణాలు, నగరాల మధ్య ప్రజలు సులభంగా ప్రయాణించేందుకు ఈ రైళ్లు ఉపయోగపడతాయని అన్నారు. ఇవి తమ సమీప పట్టణాల్లో ఉన్నత విద్య కోసం వెళ్లే విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంటాయని చెప్పారు. అలాగే ఆరోగ్యం, ఉద్యోగం, ఉపాధి కోసం ప్రయాణించే సామాన్య ప్రజలకూ ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.



# సెక్స్ వర్కర్లపై దాడులు సరికాదు

- వారు కూడా మనుషులే అని గుర్తించాలి
- లైంగిక వృత్తిలో ఉన్నవారికి ఆధార్ కార్డులు ఇవ్వాలి : సుప్రీం కోర్టు

**న్యూఢిల్లీ, మే 29 :** స్వచ్ఛందంగా ప్రాస్టిట్యూషన్‌ను ఎంచుకోవడం, మానవ అక్రమ రవాణా బారినపడి సెక్స్ వర్క్‌లోకి దిగడం మధ్య స్పష్టమైన తేడా ఉందని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఇష్టపూర్వకంగా సెక్స్ వర్క్ చేసే వయోజనులను వేధించవద్దని పోలీసులకు ఆదేశా లు జారీ చేసింది. సెక్స్ వర్కర్లకు చట్టపరంగా సమాన రక్షణ ఉండాలని పేర్కొంది. దాడుల సమయంలో వారి గుర్తింపును వెల్లడించొద్దని మీడియాకు కూడా వార్నింగ్ ఇచ్చింది. దేశంలో మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు సమగ్ర మార్గదర్శకాలు జారీ చేసింది. స్వచ్ఛందంగా సెక్స్ వర్క్‌ను ఎంచుకున్న వారికి, మానవ అక్రమ రవాణా ముఠాల బారిన పడి ఈ రొంపిలో కూరుకుపోయిన బాధితులకు మధ్య తేడాను గుర్తించాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. సొంత ఇష్టంతో సెక్స్ వర్క్ నిర్వహించే వయోజనులపై దాడులు చేయడం, క్రిమినల్ కేసులు పెట్టడం చట్టవిరుద్ధమని పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి ఒక్కరికీ గౌరవంగా జీవించే హక్కు ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కేవలం లైంగిక వృత్తిలో తల్లి ఉందనే ఏకైక కారణంతో ఆమె నుంచి బిడ్డను బలవంతంగా వేరు చేయలేరని కూడా సుప్రీం కోర్టు పేర్కొంది. రెస్క్యూ ఆపరేషన్ల సమయంలో సెక్స్ వర్కర్ల ఫోటోలు, వీడియోలు ప్రసారం చేయడం నేరమని పేర్కొంది. నివాస ధ్రువీకరణ పత్రాలు లేకపోయినప్పటికీ సెక్స్ వర్కర్లందరికీ తక్షణమే ఆధార్ కార్డులు జారీ చేయాలని కూడా ఆదేశించింది. స్వచ్ఛందంగా ఈ మార్గాన్ని ఎంచుకున్న వారిని వదిలి, మహిళలు, మైనర్లను అక్రమ రవాణా చేసే మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని కూడా సుప్రీం కోర్టు ఆదేశించింది.

# మహనీయుల విగ్రహాల ఏర్పాటులో ఇబ్బందులు

## అధికారులతో సమీక్షించిన మంత్రి అడ్లూరి

**హైదరాబాద్, మే 29 :** మహనీయుల విగ్రహాల ప్రతిష్ఠాపనకు సంబంధించిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఉన్నతాధికారులను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు ఎదురవుతున్న ఇబ్బందులపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అధ్యక్షతన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. విగ్రహాల ఏర్పాటులో అధికారులు, పోలీసులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. నియమాలకు విరుద్ధమైన స్థలాలపై ముందుగానే నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేశారు. చివరి నిమిషంలో అభ్యంతరాలు చెప్పొద్దని అధికారులకు మంత్రి సూచించారు. దళిత సంఘాల నాయకులపై అనవసరంగా కేసులు పెట్టొద్దని తెలిపారు. అలాగే ప్రజల భావోద్వేగాలను గౌరవించాల్సి ఉందని పేర్కొన్నారు. అంబేడ్కర్, ఫులే, జగ్జీవన్ రామ్ ఆశయాలే ప్రభుత్వానికి మార్గదర్శకమని చెప్పారు. సామాజిక న్యాయమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అభివర్ణించారు. విగ్రహాలు సామాజిక చైతన్యానికి ప్రతీకలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. సమస్యల పరిష్కారంపైనే ప్రధాన దృష్టి పెట్టాల్సి ఉందని ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అభిప్రాయపడ్డారు.

## మాజీ మంత్రి గాదె వెంకట్‌రెడ్డి
# కన్నుమూత



**హైదరాబాద్, మే 29 :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు గాదె వెంకటరెడ్డి కన్నుమూశారు. గతకొద్ది రోజులుగా వయోభారం, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతోన్న ఆయన శుక్రవారం హైదరాబాద్‌లోని నివాసంలో తుదిశ్వాస విడిచారు. వెంకటరెడ్డి మృతిని ఆయన కుటుంబ సభ్యులు ధృవీకరించారు. వెంకటరెడ్డి మరణంపై పలువురు రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. 1940 జూలై 10న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా ఇంకొల్లు మండలం పావులూరు గ్రామంలో గాదె వెంకటరెడ్డి జన్మించాడు. ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన ఆయన కాంగ్రెస్ పార్టీ రాజకీయ అరంగ్రేటం చేశారు. 1967లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పరుచూరు నియోజకవర్గం నుండి పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచాడు. ఆ తరువాత 1972లో కాంగ్రెస్ అభ్యర్థిగా.. 1978లో జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి రెండు సార్లు మద్దుకూరి నారాయణ రావుపై ఓడిపోయారు. 1983, 1985,1989 ఎన్నికల్లో వరుసగా ఓటమి చవిచూశారు. తిరిగి 1991 ఉప ఎన్నికల్లో అలాగే 1994 సార్వత్రిక ఎన్నికల్లో పరుచూరు ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

# న్యాయవాదిని చంపేందుకు రూ.25లక్షల సుపారీ

**హైదరాబాద్:** హైదరాబాద్‌లో వక్ఫ్‌బోర్డు ప్యానల్ న్యాయవాది ఖాజా మొహిజుద్దీన్(63) హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన నిందితులు మహబూబ్ ఆలంఖాన్, అతని కుమారుడిని అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. మొహిజుద్దీన్ హత్యకు.. నిందితులు రెండేళ్లలో 10 సార్లు యత్నించినట్టు పోలీసులు గుర్తించారు. హత్యకు రూ. 25లక్షలు సుపారీ ఇచ్చినట్టు దర్యాప్తులో తేలింది. రెడ్‌హిల్స్ శాంతినగర్‌లోని మోయిజ్ రెసిడెన్సీలో నివాసం ఉండే మొహిజుద్దీన్ సిటీ సివిల్ కోర్టులో, హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. వక్ఫ్ స్థలాలను ఆక్రమించి కళాశాలలు నిర్మించారంటూ ఓ ప్రముఖ విద్యాసంస్థ నిర్వాహకులతో వక్ఫ్‌బోర్డు ప్యానల్ న్యాయవాదిగా న్యాయపోరాటం సాగిస్తున్నారు. ఈ నెల 23న ఉదయం 5.42 గంటలకు స్విమ్మింగ్‌కు వెళ్లేందుకు ఇంటి నుంచి బయటకు వచ్చారు. ఇంటి ముందు నిలిపిన కారు డోర్ తీసేందుకు సిద్ధమవుతున్న సమయంలో కొద్దిదూరంలో నిలిపి ఉన్న కారు వేగంగా వచ్చి ఆయనను ఢీకొట్టి 20 మీటర్ల దూరం లాక్కెళ్లింది. తీవ్రంగా గాయపడిన ఆయనను కుటుంబసభ్యులు ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతిచెందారు.

# శ్రీవాణి టిక్కెట్లలో మార్పులు

## 1గంటలోపు బుక్ చేసుకున్న వారికి 4గంటలకు దర్శనం



**తిరుమల, మే 29 :** భక్తుల సౌకర్యార్థం శ్రీవాణి ట్రస్ట్‌కు సంబంధించిన దర్శన టికెట్ల కేటాయింపులో పలు మార్పులు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం టిటిడి తెలిపింది. శ్రీవాణజ టిక్కెట్లు నేరుగా బుక్ చేసుకున్న వారికి అదేరోజు సాయంత్రం దర్శనం కలగనుంది. ఈ టికెట్లు ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు విడుదల చేస్తారని.. మధ్యాహ్నం 1 గంటలోపు బుక్ చేసుకున్న భక్తులకు అదే రోజు సాయంత్రం 4 గంటలకు దర్శనానికి అనుమతించనున్నట్లు పేర్కొంది. కాగా ఈ విధానం జూన్ 10 నుంచి అమలులోకి రానుంది. ఈ కోటాలో బుకింగ్ కాని టికెట్లను తిరిగి కరెంట్ బుకింగ్ కోటాలో ఇస్తామని పేర్కొంది. ఈ విధానం 2027 మార్చి 31 వరకు అమల్లో ఉంటుందని తితిదే వెల్లడించింది. ప్రస్తుతం రోజుకు 1500 శ్రీవాణి టికెట్లను తితిదే ఆన్‌లైన్ ద్వారా అందుబాటులో ఉంచుతోంది. వీటిలో 500 దర్శన టికెట్లను మూడు నెలలు ముందుగానే ఆన్‌లైన్‌లో అడ్వాన్స్ బుకింగ్ కింద అందుబాటులోకి తీసుకొస్తోంది. మరో 200 శ్రీవాణి దర్శన టికెట్లను తిరుపతి విమానాశ్రయంలో కరెంట్ బుకింగ్ కింద జారీ చేస్తోంది. ప్రస్తుతం రోజువారీ కరెంట్ బుకింగ్ కోటాలో అందుబాటులో ఉన్న 800 దర్శన టికెట్లలో ఇప్పటికే రూ. 10 వేలు విరాళం చెల్లించి దర్శన టికెట్ కోసం వేచి ఉన్న దాతలకు ప్రతిరోజూ 300 టికెట్లు ప్రత్యేకంగా కేటాయించాలని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఈ సదుపాయం 2025 మే 1 నుంచి విరాళం చెల్లించిన అర్హులైన దాతలకు వర్తించనుందని తితిదే తెలిపింది.

# సెన్సెక్స్ 1092 పాయింట్లు డౌన్



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. ఉదయం స్వల్ప లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. మధ్యాహ్నం వరకు స్వల్ప లాభాల్లో ట్రేడయ్యాయి. ఆఖర్లో అమ్మకాల ఒత్తిడితో భారీ నష్టాల్లోకి జారుకున్నాయి. అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం విషయంలో అనిశ్చితి, ఎఫ్ఐఐల విక్రయాలు కొనసాగుతుండటం సూచీలపై ప్రతికూల ప్రభావం చూపింది. దీంతో సెన్సెక్స్ ఇంట్రాడే గరిష్ఠాల నుంచి 1300 పాయింట్ల మేర నష్టపోగా.. నిఫ్టీ 23,550 దిగువన ముగిసింది. మదుపర్ల సంపద రూ.5 లక్షల కోట్లు క్షీణించి రూ.466 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 75,988.51 (క్రితం ముగింపు 75,867.80) పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడే 76,220.02 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. ఆఖర్లో అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొంది. దీంతో 74,589.11 పాయింట్ల వద్ద కనిష్ఠానికి చేరింది. చివరికి 1092.06 పాయింట్ల నష్టంతో 74,775.74 వద్ద ముగిసింది. నిఫ్టీ 359.40 పాయింట్ల నష్టంతో 23,547.75 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.05గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎల్అండ్‌టీ, ఇన్ఫోసిస్ షేర్లు మిగిలిన షేర్లు నష్టపోయాయి. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఇండిగో, ఎన్టీపీసీ, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా స్టీల్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 91.40 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4530 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.






# ఫైనల్‌కు దూసుకెళ్లిన గుజరాత్

## శతకంతో చెలరేగిన శుభ్‌మన్ గిల్..

**ముల్లాన్‌పుర్:** ఐపీఎల్-19 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. క్వాలిఫయర్-2లో రాజస్థాన్ రాయల్స్‌పై ఆ జట్టు 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ ఓటమితో రాజస్థాన్ ఇంటిబాట పట్టింది. ఈ నెల 31న అహ్మదాబాద్ వేదికగా ఆర్సీబీ, గుజరాత్ మధ్య ఫైనల్ పోరు జరగనుంది. ఐపీఎల్ ఫైనల్ చేరడం గుజరాత్‌కు ఇది మూడో సారి. తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. వైభవ్ సూర్యవంశీ మరోసారి శతకం చేసే అవకాశాన్ని మిస్ చేసుకున్నాడు. అనంతరం ఛేదనలో గుజరాత్ టైటాన్స్ 18.4 ఓవర్లలో మూడు వికెట్లు నష్టపోయి 219 పరుగులు సాధించింది. గుజరాత్ బ్యాటర్లలో శుభ్‌మన్ గిల్ (104; 53 బంతుల్లో 15 ఫోర్లు 3 సిక్స్‌లు) సెంచరీతో సత్తా చాటాడు. సాయి సుదర్శన్ (58; 32 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీ సాధించాడు. వీరిద్దరూ గుజరాత్‌కు చక్కటి ఆరంభాన్ని ఇచ్చారు. వాషింగ్టన్ సుందర్ 16 పరుగులు చేశాడు. జోస్ బట్లర్ 9లి, రాహుల్ తెవాతియా 17 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్, నాంద్రే బర్గర్, బ్రిజేశ్ శర్మ తలో వికెట్ తీసుకున్నారు. అంతకు ముందు రాజస్థాన్ రాయల్స్ బ్యాటర్లలో వైభవ్ సూర్యవంశీ (96; 47 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్స్‌లు) అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. జడేజా (45; 35 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. ఫెరీరా (38; 11 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) వేగంగా పరుగులు రాబట్టాడు. యశస్వి జైస్వాల్ (1), ధ్రువ్ జురేల్ (7), రియాన్ పరాగ్ (11) బ్యాటింగ్‌లో విఫలమయ్యారు. గుజరాత్ టైటాన్స్ బౌలర్లలో కగిసో రబాడ, జాసన్ హోల్డర్ చెరో 2, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ తలో వికెట్ తీసుకున్నారు.





# లఖ్‌నవూ కెప్టెన్సీ నుంచి వైదొలిగిన రిషభ్ పంత్

ఈ ఏడాది ఐపీఎల్ సీజన్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ఘోరంగా విఫలమైంది. మొత్తం 14 మ్యాచ్‌ల్లో కేవలం నాలుగు మ్యాచ్‌లో గెలిచి పాయింట్ల పట్టికలో అట్టడుగున పడిపోయింది. ఈ నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ సీజన్‌లో లఖ్‌నవూ (రా+)కు సారథ్యం వహించిన రిషభ్ పంత్ కెప్టెన్సీ నుంచి వైదొలిగాడు. ఈ మేరకు ఫ్రాంఛైజీ 'ఎక్స్' వేదికగా ప్రకటన చేసింది. "కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించాలని రిషభ్ పంత్ చేసిన అభ్యర్థనను ఫ్రాంఛైజీ మర్యాదపూర్వకంగా అంగీకరించింది. ఈ మార్పు తక్షణమే అమల్లోకి వస్తుంది. ఇలాంటి నిర్ణయం తీసుకోవడం అంత సులభమేమీ కాదు. కెప్టెన్‌గా పంత్ ఇప్పటివరకు ఫ్రాంఛైజీకి గొప్పగా సేవలందించాడు" అని రాసుకొచ్చింది. ప్రస్తుత పరిస్థితుల్లో జట్టును అత్యుత్తమ ప్రమాణాలతో పునర్నిర్మించడంపై తాము దృష్టి పెట్టినట్లు తెలిపింది. 2025 ఐపీఎల్ మెగా వేలంలో పంత్‌ను లఖ్‌నవూ ఫ్రాంఛైజీ ఏకంగా రూ.27 కోట్లతో దక్కించుకున్న సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఈ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. అయితే, పంత్ సారథ్యంలో లఖ్‌నవూ రెండు సీజన్‌లలో కలిసి కేవలం 10 మ్యాచ్‌లో గెలవడం గమనార్హం. 2025 సీజన్‌లో ఈ జట్టు ఆరు విజయాలతో ప్లేఆఫ్స్‌కు కూడా చేరుకోలేకపోయింది. ఇక, బ్యాటింగ్ పరంగానూ పంత్ ఆకట్టుకోలేకపోయాడు. గత సీజన్‌లో మొత్తం 14 మ్యాచ్‌ల్లో కేవలం 269 పరుగులు చేసిన అతడు.. ఈ ఏడాది మొత్తంగా 312 పరుగులు సాధించాడు.






# సంక్షేమ పథకాలకు డిజిటల్ కరెన్సీ

### వార్షిక నివేదికలో ఆర్‌బీఐ

**ముంబయి:** సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ పైలట్ ప్రాజెక్ట్‌ను మరింత విస్తరించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యోచిస్తోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రిటైల్ రంగానికీ విస్తరించాలని భావిస్తోంది. ఫైనాన్షియల్ అసెట్ టోకనైజేషన్‌కు ఉన్న అవకాశాలనూ పరిశీలించాలని ఆర్‌బీఐ యోచిస్తోంది. తద్వారా సీబీడీసీ పైలట్ ప్రాజెక్ట్‌లో మరింత మందిని భాగస్వాములను చేయాలనుకుంటోంది. ఈ మేరకు ఆర్‌బీఐ తన వార్షిక నివేదికలో ఈ అంశాన్ని పొందుపరిచింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో గుజరాత్, పుదుచ్చేరి, చండీగఢ్‌లలో నగదు బదిలీ పథకాల కింద డిజిటల్ కరెన్సీని ప్రయోగాత్మకంగా పరిశీలించినట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. ప్రజా పంపిణీ వ్యవస్థ లబ్ధిదారులకూ ఆహార సబ్సిడీని సీబీడీసీ ద్వారా అందించారు. లబ్ధిదారులు ఆ నిధులను రేషన్ షాపులు, ఎంపిక చేసిన వ్యాపారుల వద్ద వస్తువుల కొనుగోలుకు మాత్రమే ఉపయోగించేలా చూశారు. దీన్ని మరింత విస్తరించాలని భావిస్తోంది. పశ్చిమాసియా రూపంలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, పెరిగిన ఇంధన ధరలు, సప్లయ్ చైన్ అవరోధాలు ఉన్నా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశ వృద్ధికి ఢోకా లేదని ఆర్‌బీఐ పేర్కొంది. పటిష్టమైన స్థూల ఆర్థిక పునాదులు బలంగా ఉండడమే దీనికి కారణమని తన వార్షిక నివేదికలో తెలిపింది. కార్పొరేట్, బ్యాంకింగ్ రంగాల బలోపేతమైన బ్యాలెన్స్ షీట్లు, ప్రభుత్వ మూలధన వ్యయం కారణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి సానుకూలంగా ఉండనుందని తెలిపింది. వివిధ వాణిజ్య భాగస్వాములతో కుదుర్చుకున్న ఒప్పందాలు కూడా వృద్ధికి దన్నుగా నిలవనున్నాయని అభిప్రాయపడింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో భారత్ 7.6 శాతం వృద్ధి రేటును నమోదు చేసి, ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని ఆర్‌బీఐ గుర్తు చేసింది. 2026-27లో వ్యవసాయ రంగం నైరుతి రుతుపవనాలపై ఆధారపడి ఉంటుందని అంచనా వేసింది. ఎల్‌నినో కారణంగా పంటల దిగుబడిపై ప్రభావం ఉన్నా.. రుతు పవనాల ప్రయాణంలో హిందూ మహాసముద్రంలో ఏర్పడే డైపోల్ ద్వారా ప్రతికూల ప్రభావాన్ని అధిగమించొచ్చని పేర్కొంది.

# ట్రిలియన్ డాలర్లకు చేరువలో ఆంథ్రోపిక్..

కృత్రిమమేధ సంస్థలు ఇప్పుడు ఇన్వెస్టర్లకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. తాజాగా ఏఐ స్టార్టప్ ఆంథ్రోపిక్ మార్కెట్ విలువ ట్రిలియన్ డాలర్లకు చేరువైంది. తాజాగా 65 బిలియన్ డాలర్ల నిధుల సమీకరణ సమయంలో కంపెనీ విలువను ఇన్వెస్టర్లు 965 బిలియన్ డాలర్లుగా లెక్కగట్టారు. ఈ ఫండింగ్ విషయాన్ని గురువారం ప్రకటించారు. ఆల్టిమీటర్ క్యాపిటల్, డ్రాగోనీర్, గ్రీనోక్స్, సెక్వోయా క్యాపిటల్ వంటి సంస్థలు నిధులిచ్చిన జాబితాలో ఉన్నాయి. ఈ సంస్థలు ఒక్కోటీ రెండు బిలియన్ డాలర్ల చొప్పున ఆంథ్రోపిక్‌లో పెట్టుబడులు పెట్టినట్లు తెలుస్తోంది. సెక్వోయా మాత్రం దీనిపై స్పందించేందుకు ఇష్టపడలేదు. ఈ విడతలో కూడా గూగుల్ సంస్థ నుంచి భారీగానే పెట్టుబడులు అందాయి. ఇప్పటికే ఆంథ్రోపిక్‌లో 40 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెడతానని ఈ టెక్ దిగ్గజం ప్రకటించింది. అమెజాన్ 5 బిలియన్ డాలర్ల నిధులను సమకూర్చినట్లు తెలుస్తోంది. శాంసంగ్ ఎలక్ట్రానిక్స్, మైక్రాన్ టెక్నాలజీ, ఎస్‌కే హైనిక్స్‌లు కూడా ఇన్వెస్టర్ల జాబితాలో ఉన్నాయి. కృత్రిమ మేధకు సంబంధించిన రంగాల్లోని సంస్థల మార్కెట్ విలువ భారీగా పెరుగుతోంది. ఇటీవలే చిప్‌ల తయారీ కంపెనీలు శాంసంగ్ ఎలక్ట్రానిక్స్, మైక్రాన్ టెక్నాలజీ, ఎస్‌కే హైనిక్స్‌లు ట్రిలియన్ డాలర్ల మార్కెట్ విలువను తాకాయి. ఇదిలా ఉండగా.. క్లాడ్ ఓపస్ 4.8 మోడల్‌ను ఆంథ్రోపిక్ తాజాగా అందుబాటులోకి తెచ్చింది. ఇక మిథోస్ శ్రేణి ఏఐని వినియోగదారులకు కొన్ని వారాల్లో అందుబాలోకి తెస్తామని ఈ కంపెనీ ప్రకటించింది. అయితే దీనికి సంబంధించిన కచ్చితమైన వివరాలను మాత్రం బహిర్గతం చేయలేదు. మిథోస్ తన అత్యాధునిక సైబర్ సెక్యూరిటీ సామర్థ్యాలతో పలు సాఫ్ట్‌వేర్‌లలో ఏళ్లతరబడి ఉన్న బగ్‌లను వేగంగా కనుగొని.. వాటిని వాడుకొనే మార్గాలను చెప్పింది. దీంతో అమెరికాలోని చాలా టెక్ దిగ్గజ సంస్థలు తమ సాఫ్ట్‌వేర్ల విషయంలో అప్రమత్తమయ్యాయి. అగ్రరాజ్య ప్రభుత్వం ఒత్తిడితో మిథోస్ విడుదలను ఆంథ్రోపిక్ వాయిదా వేసుకొంది. మరోవైపు, ప్రాజెక్ట్ గ్లాస్‌వింగ్ పేరిట మిథోస్‌ను వాడి టెక్ దిగ్గజాల్లో సాఫ్ట్‌వేర్‌లను సరిచేసే పని మొదలుపెట్టారు.




# ఎల్ఐసీ షేర్లు 50 శాతం పడ్డాయా?

ప్రభుత్వరంగ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ షేర్లు శుక్రవారం నాటి ట్రేడింగ్ సెషన్‌లో 50 శాతం మేర క్షీణించినట్లు కనిపిస్తోంది. వాస్తవానికి ఎల్ఐసీ బోనస్ ఇష్యూ సంగతి తెలీని వారు ఈ మార్పు చూసి ఒక్కసారిగా అవాక్కయ్యారు. శుక్రవారం నుంచి బోనస్ షేర్ల జారీ షేరు విలువలో ప్రతిఫలించడమే ఇందుకు కారణం. బుధవారం మార్కెట్ ముగిసే సమయానికి ఎన్ఎస్ఈలో ఎల్ఐసీ షేరు విలువ రూ.830గా ఉంది. బోనస్ షేరు వల్ల విలువ సగమైంది. ఈ క్రమంలోనే శుక్రవారం మార్కెట్ ప్రారంభంలో రూ.417.60 వద్ద ప్రారంభమైంది. తర్వాత ఒక శాతం నష్టంతో రూ.411 వద్ద మగిసింది. అంటే నష్టపోయింది ఒక శాతం లోపే. కానీ, 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లు జారీ చేయడం వల్ల స్టాక్ ధరలో పెద్ద మొత్తంలో నష్టపోయినట్లు కనిపించింది. మే 29 నాటికి ఎల్ఐసీ షేర్లు ఉన్నవారికి 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను జారీ చేయాలని ఎల్ఐసీ నిర్ణయం తీసుకుంది. రూ.10 ముఖవిలువ కలిగిన ఒక్కో ఈక్విటీ షేరు కలిగిన వాటాదార్లకు అదనంగా రూ.10 ముఖ విలువ కలిగిన మరో ఈక్విటీ షేరును బోనస్‌గా జారీ చేస్తామని ప్రకటించింది. ఇందుకోసం 2025 డిసెంబరు 31 నాటికి ఎల్ఐసీ వద్ద ఉన్న రూ.6,325 కోట్ల నిల్వలు, మిగులు నిధులతో ఈ బోనస్ ఇష్యూను పూర్తి చేయనున్నట్లు ఎక్స్ఛేంజీలకు గతంలో ఎల్ఐసీ సమాచారం ఇచ్చింది. దీనివల్ల కంపెనీ షేర్ల సంఖ్య పెరగడమే కాకుండా.. రిటైల్ మదుపర్లను ఆకర్షించడానికి ఉపయోగపడుతుంది. షేర్ల సంఖ్య పెరిగినంత మాత్రాన కంపెనీ మార్కెట్ విలువలో ఎలాంటి మార్పూ ఉండదు.



# పెద్దిలో అప్పలసూరిగా జగపతిబాబు

అప్పలసూరిగా 'పెద్ది'లో తన నటనతో ఆకట్టుకునేందుకు సిద్ధమయ్యారు నటుడు జగపతి బాబు . రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న జగపతిబాబు తన కెరీర్ గురించి మాట్లాడారు. మన కష్టానికి తగిన ఫలితం కచ్చితంగా లభిస్తుందన్నారు. సినిమా రంగంలో ఉన్నంత ఆనందం నాకు ఇంక ఎందులోనూ కనిపించదు. ఇందులో ఏదైనా సాధ్యమవుతుంది. సహజంగా నా జీవితంలో ప్రతిదీ ఆలస్యంగా వస్తుంది. కెరీర్‌లో కూడా మొదట ఫ్లాప్‌ల నుంచి హిట్‌లకు వచ్చాను. అందుకే పరాజయాలను పెద్దగా పట్టించుకోను. ఏదో ఒకరోజు విజయం తప్పక వస్తుంది నమ్ముతా. జీవితం మన అంచనాలకు అందదు. తర్వాత ఏం జరుగుతుందో ఎవరికీ తెలీదు. కానీ, ప్రతి ఒక్కరికి కష్టాలు కామన్‌గా ఉంటాయి. నేనూ ఎన్నో కష్టాలు పడ్డాను. ఇలా జరిగిందేంటని ఎప్పుడూ బాధపడలేదు. వాటి నుంచి ఏదో కొత్త పాఠం నేర్చుకున్నాను. కష్టానికి తగిన ప్రతిఫలం వస్తుందని ఎప్పుడూ నమ్ముతాను. బాధ వెనక సంతోషం కచ్చితంగా ఉంటుంది. నేను 2011 నుంచి 2013 వరకు ఎంతో బాధ అనుభవించా. దానికి తగిన సంతోషం ఇప్పుడు వచ్చింది. నా టైమ్ ఇప్పుడు స్టార్ట్ అయింది అనుకుంటున్నా అని జగపతి బాబు అన్నారు. సినిమాల విషయంలో ఎప్పుడూ ఒత్తిడికి గురి కాలేదని జగపతి బాబు ఈ సందర్భంగా తెలిపారు. ఫ్యామిలీ ఇష్యూ కాకుండా ఇంకా దేనిని పెద్ద సమస్యగా తీసుకోనని అన్నారు. 'పెద్ది'లో తనకు, రామ్ చరణ్‌కు మధ్య ఉండే బంధం అందరికీ నచ్చుతుందన్నారు. చరణ్ అన్ని సినిమాలకు కష్టపడతారని.. ఈ చిత్రంలో శరీరాకృతిని మార్చుకోవడం కోసం మరింత ఎక్కువ శ్రమించారని చెప్పారు.




# పెద్దిపై అసత్య ప్రచారం




ఇద్దరు వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు 'పెద్ది'పై అసత్య ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలతో ఇద్దరిపై కేసు నమోదైనట్లు సమాచారం. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న ఈ సినిమా విషయంలో టీమ్ చాలా జాగ్రత్తలు తీసుకుంటోంది. తాజాగా దీనిపై ఆన్‌లైన్ వేదికగా అసత్య ప్రచారం చేస్తోన్న ఇద్దరి వ్యక్తులను గుర్తించి వారిపై ఫిర్యాదు చేసింది. గుంటూరు, హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు యువకులు 'పెద్ది'పై ఉద్దేశపూర్వకంగా సోషల్ మీడియాలో నెగెటివిటీ క్రియేట్ చేస్తున్నట్లు టీమ్ దృష్టికి వచ్చింది. దీంతో ఆధారాలను సేకరించిన చిత్రబృందం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. ఇప్పటికే చిత్ర నిర్మాతలు ఈ సినిమాకు సంబంధించిన సన్నివేశాలు లీక్ కాకుండా జాగ్రత్తలు తీసుకున్న విషయం తెలిసిందే. సినిమా కాపీరైట్‌కు సంబంధించి చిత్ర నిర్మాణ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారించిన మద్రాసు హైకోర్టు వెకేషన్ బెంచ్ తాజాగా మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ఈ సినిమాకు సంబంధించిన సన్నివేశాలు, పాటలు ఇంటర్నెట్‌లో అక్రమంగా అప్‌లోడ్ చేయడం, ప్రసారం చేయడం, కాపీ చేయడాన్ని నిరోధిస్తూ న్యాయస్థానం ఈ ఆదేశాలిచ్చింది.

# దేవిశ్రీతో ప్రయాణం ముగిసినట్లేనా?

టాలీవుడ్ దర్శకుడు సుకుమార్- సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ కాంబినేషన్‌కు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. 'ఆర్య'తో మొదలైన వీరి ప్రయాణం 'రంగస్థలం', 'పుష్ప' వంటి ఇండస్ట్రీ హిట్స్ వరకు చేరి తెలుగు సినీ పరిశ్రమలో ఓ ప్రత్యేకమైన ముద్ర వేసింది. సుకుమార్ సినిమాలకు దేవిశ్రీ ఇచ్చిన సంగీతం అనేక సందర్భాల్లో సినిమాకే హైలైట్‌గా నిలిచింది. అందుకే ఈ కాంబోకు అభిమానుల్లో ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ ఏర్పడింది. ఇప్పటివరకు తన సినీ కెరీర్‌లో సుకుమార్ పూర్తి స్థాయిలో దేవిశ్రీ ప్రసాద్‌తోనే ప్రయాణించడం విశేషం. వీరిద్దరి మధ్య ఉన్న అండర్‌స్టాండింగ్, కథను సంగీతంతో మరింత ఎమోషనల్‌గా ఎలివేట్ చేసే తీరు ప్రేక్షకులను ఎప్పటికప్పుడు ఆకట్టుకుంది. అయితే ఇటీవల కాలంలో ఈ క్రేజీ కాంబినేషన్‌కు బ్రేక్ పడే అవకాశాలున్నాయంటూ ఫిలిం నగర్‌లో జోరుగా చర్చ సాగుతోంది. ముఖ్యంగా 'పుష్ప-2' నిర్మాణ సమయంలో ఇద్దరి మధ్య కొన్ని విభేదాలు తలెత్తినట్లు ప్రచారం జరిగింది. సినిమాలోని కొన్ని కీలక సన్నివేశాలకు దేవిశ్రీ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ విషయంలో సుకుమార్ పూర్తిగా సంతృప్తి చెందలేదని, అందుకే కొన్ని భాగాలకు ఇతర సంగీత దర్శకుల సహాయం తీసుకున్నారనే టాక్ ఇండస్ట్రీలో వినిపించింది. ఈ పరిణామం దేవిశ్రీ ప్రసాద్‌ను అసంతృప్తికి గురిచేసిందని, ఆ బాధను ఆయన ఓ ఈవెంట్‌లో పరోక్షంగా వ్యక్తం చేశారనే చర్చ కూడా జరిగింది. ఇప్పుడు అదే చర్చ మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా సుకుమార్ తెరకెక్కించబోయే తదుపరి భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు దేవిశ్రీ ప్రసాద్ స్థానంలో కొత్త సంగీత దర్శకుడిని తీసుకోబోతున్నారనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇదే సమయంలో దేవిశ్రీ ప్రసాద్ 'ఎల్లమ్మ' సినిమాతో హీరోగా కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించబోతుండటం కూడా ఈ ప్రచారానికి మరింత బలం చేకూర్చింది.

అంతేకాదు, పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రానికి దేవిశ్రీ పూర్తి స్థాయిలో సంగీతం అందించలేకపోయారని, అందుకే ఆ బాధ్యతలను థమన్‌కు అప్పగించారనే ప్రచారం కూడా ఇండస్ట్రీలో వినిపిస్తోంది. ఒకప్పుడు వరుసగా దేవిశ్రీతో పనిచేసిన పలువురు స్టార్ దర్శకులు ఇప్పుడు ఇతర సంగీత దర్శకుల వైపు మొగ్గు చూపుతుండటంతో.. సుకుమార్ కూడా అదే దారిలో వెళ్తారా అనే ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం రామ్ చరణ్ - సుకుమార్ సినిమా ఇంకా స్క్రిప్ట్ దశలోనే ఉందని సమాచారం.

# జాసన్ సంజయ్ దర్శకుడిగా సిగ్మా

తమిళనాడు సీఎం, తమిళగ వెట్రి కజగం పార్టీ అధినేత విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతున్న మొదటి సినిమా 'సిగ్మా' విడుదల తేదీ తాజాగా ఖరారైంది. వైవిధ్యమైన పాత్రలతో మెప్పిస్తున్న టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ మరియు ఫరియా అబ్దుల్లా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ హై-ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం జులై 31న ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున థియేటర్లలోకి రానుంది. ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఎ. సుబాస్కరన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ మైండ్ గేమ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్.ఎస్. తమన్ సంగీతం అందిస్తుండగా, ప్రవీణ్ కె.ఎల్. ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మనం కోల్పోయిన దాన్ని తిరిగి అదే స్థానంలో వెతుక్కోవడం, దానికోసం ఎంత మూల్యం చెల్లించాల్సి వచ్చింది అనే ఆసక్తికరమైన కాన్సెప్ట్ చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని చిత్ర యూనిట్ పేర్కొంది. కెనడాలోని టొరంటో ఫిల్మ్ స్కూల్‌లో ఫిల్మ్ మేకింగ్ కోర్స్ మరియు లండన్‌లో స్క్రీన్‌రైటింగ్ పూర్తి చేసిన జాసన్ సంజయ్, తన తండ్రి స్టార్ ఇమేజ్‌తో సంబంధం లేకుండా ఒక వైవిధ్యమైన కథాంశంతో మెగా ఫోన్ పట్టడం పరిశ్రమలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర టీజర్ మరియు పోస్టర్లు సినిమాపై అంచనాలను భారీగా పెంచేశాయి. ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్ తెలుగు మరియు తమిళ భాషల్లో ఒకేసారి ప్రేక్షకుల ముందుకు రానుంది.






# క్రైమ్ థ్రిల్లర్‌గా మరీచిక

సంజయ్ అలియాస్ సంజు (విరాజ్ అశ్విన్) ఓ కెఫేని నిర్వహిస్తుంటాడు. అతణ్ని వెంకట లక్ష్మి (అనుపమ పరమేశ్వరన్) ప్రేమిస్తుంది. ఎప్పుడూ అతని కెఫే చుట్టూ తిరుగుతుంటుంది కానీ, తన మనసులోని ప్రేమని మాత్రం వ్యక్తం చేయలేక సతమతమవుతుంది. ఇంతలో వెంకట లక్ష్మికి లండన్ నుంచి వచ్చిన మరీచిక (రెజీనా కసండ్రా) పరిచయమవుతుంది. వెంకటలక్ష్మి కారణంగానే సంజుకి పరిచయం అవుతుంది మరీచిక. ఆ ఇద్దరి మధ్య తక్కువ సమయంలోనే సాన్నిహిత్యం పెరుగుతుంది. ఒకరినొకరు ప్రేమించుకుంటారు. ఊహించని రీతిలో ఆ ఇద్దరి ప్రేమకు వెంకటలక్ష్మి కూడా సాయం చేస్తుంది. కానీ, అంతలోనే సంజుని మరీచిక దారుణంగా చంపేస్తుంది. కళ్లారా ఆ హత్యని చూసిన వెంకటలక్ష్మి పోలీస్‌స్టేషన్‌కి చేరుకుని ఫిర్యాదు చేస్తుంది. అసలింతకీ ప్రేమించిన సంజుని మరీచిక ఎందుకు హత్య చేసింది? అసలు మరీచిక ఎవరు? సంజుపై ఉన్న ప్రేమతో వెంకటలక్ష్మి ఏం చేసింది? తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవల్సిందే. ప్రేమ, ద్రోహం, ప్రతీకారంతో ముడిపడిన కథ ఇది. పేరుకు తగ్గట్టే ఎండమావుల్ని గుర్తు చేస్తుంటాయి ఇందులోని సంఘటనలు, పాత్రలన్నీ! సున్నితమైన ఓ ముక్కోణపు ప్రేమకథలా ప్రారంభమయ్యే సినిమా ఆ తర్వాత అనూహ్యమైన మలుపులతో ఓ క్రైమ్ థ్రిల్లర్‌గా మారిపోతుంది. ప్రధానమైన మూడు పాత్రలూ ఏది నిజం, ఏది అబద్ధం అనే ఉత్కంఠని రేకెత్తిస్తాయి. ఓ థ్రిల్లర్ కథని ప్రేమతో ముడిపెడుతూ రాసుకున్న తీరు ఆసక్తికరంగానే అనిపిస్తుంది. తెరపైన కథ చెప్పే విధానంలో ఎప్పటికప్పుడు మెరుపు వేగంతో మార్పులు చోటు చేసుకుంటాయి.

Uttejitha:-Printed,editor,Pablished And owned By M.chandrasek her.46-801u2.Budhawerpeta.kurnool.andrapradesh.pin 518002.printed At Uttejitha -Printers.Kurnool.Ap.cell 9440140418. RNI ApTEEL2008/24570.